జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*




సంపుటి 12 సంచిక 100 విశాఖపట్నం | శుక్రవారం 25 డిసెంబర్ 2020 | 8 పేజీలు | వెల : 5.00

## మనకున్న పెద్దబలం అదే : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ/కోల్‌కతా, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** స్వాతంత్ర్య సమరయోధుల పోరాట ఫలితంగానే ఆత్మనిర్భర్ భారత్ అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. విద్య గొప్పదనాన్ని గుర్తించిన వారి స్ఫూర్తితో మరింత శక్తివంతమైన, తెలివైన జాతిని నిర్మించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. స్వాతంత్ర సంగ్రామ కాలంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మార్గదర్శనంలో విశ్వభారతి యూనివర్సిటీ రూపుదిద్దుకుందని, ఆనాడే ఆత్మనిర్భర్ భారత్‌కు బీజం పడిందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని విశ్వభారతి యూనివర్సిటీ శతవసంతోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. " జ్ఞాన సముపార్జనకై విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ఎంతో మంది ముందుకు వచ్చారు. విశ్వభారతి, బెనారస్ హిందూ యూనివర్సిటీ, అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, జామియా ఇస్లామియా యూనివర్సిటీ, ఆంధ్రా యూనివర్సిటీ, అన్నామలై యూనివర్సిటీ వంటి ఎన్నెన్నో విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. ప్రస్తుతకాలంలో పెద్ద సంఖ్యలో ప్రజలు విద్యనభ్యసిస్తున్నారు. జాతిని మరింత శక్తివంతం చేసేందుకు మనం దానిని ఉపయోగించాల్సి ఉంటుంది. స్వాత్రంత్యం కోసం పోరాడిన ఎంతో మంది మహానుభావులు జాతి కోసం తమ జీవితాన్ని త్యాగం చేశారు. వారి కారణంగానే నేడు మనం ఈ స్థాయిలో ఉన్నాం" అని పేర్కొన్నారు. ఇక తన స్వరాష్ట్రం గుజరాత్‌తో రవీంద్రనాథ్ ఠాగూర్‌కు అనుబంధం ఉందన్న ప్రధాని మోదీ.. " గురుదేవ్ గురించి నాకు తెలిసిన కొన్ని విషయాలు చెబుతాను. తన పెద్దన్నయ్యకు గుజరాత్‌లో పోస్టింగ్ వచ్చిన కారణంగా ఆయనను చూసేందుకు అనేకసార్లు అక్కడికి మిగతా 2లో..

### రాక్షసత్వం నిండిన వ్యక్తి దేవుడి మీద ప్రమాణం చేయడమా!

వెలగపూడి రామకృష్ణ సవాల్‌పై స్పందించిన విజయసాయిరెడ్డి



**అమరావతి, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ విసిరిన సవాల్‌పై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పందించారు. ఈమేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. విజయవాడలో వంగవీటి రంగా హత్య కేసులో నిందితుడైన వెలగపూడి రామకృష్ణ దేవుడి మీద ప్రమాణం చేస్తానని సవాల్ విసిరినట్టుగా మీడియాలో చూశాను. రామకృష్ణ తామంతా కలిసి చంపేసిన వంగవీటి మీద అయినా ప్రమాణం చేయగలడు. చంద్రబాబు వల్ల మరణించిన ఎన్టీఆర్ మీద అయినా మిగతా 2లో..

## పులివెందుల రుణం ఎప్పటికీ తీరనిది

### రూ.5 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### గండికోట రిజర్వాయర్‌పై కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పనులు: సీఎం జగన్



**కడప, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** పులివెందుల ప్రాంతానికి ఎంత చేసినా రుణం తీర్చుకోలేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా కడప జిల్లా పులివెందుల చేరుకున్న సీఎం రూ.5 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గురువారం మధ్యాహ్నం పులివెందులలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుని.. ఆర్టీసీ బస్టాండ్, డిపోలకు శంకుస్థాపన చేశారు. అలాగే స్థానిక దేవాలయాల అభివృద్ధి, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేసి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో చేపట్టిన కొత్త బీటీ రోడ్లకు శంకుస్థాపన నిర్వహించారు. గండికోట-సీబీఆర్, గండికోట-పైడిపాలెం లిఫ్ట్ స్కీం, 4 మోడల్ పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు. గండి ఆంజనేయస్వామి క్షేత్రంలో అభివృద్ధి పనులకు సీఎం ప్రారంభించారు.

#### పులివెందులలో మోడల్ పోలీస్ స్టేషన్

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రసంగించారు. వచ్చే ఫిబ్రవరిలో వైఎస్ఆర్ వైద్య కళాశాల పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు 5 సబ్‌స్టేషన్ల ఏర్పాటు చేయనున్నామన్నారు. యురేనియం బాధిత గ్రామాల్లో సాగు, తాగునీటి పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో అదనపు భవనాలను నిర్మిస్తామని తెలిపారు. 'వేంపల్లిలో డిగ్రీ కాలేజీకి నూతన శాశ్వత భవనాలను ఏర్పాటు చేస్తాం. నల్లపల్లిచెరువుపల్లిలో 130 కేవీ సబ్ స్టేషన్‌తో 14 గ్రామాలకు మంచి జరుగుతుంది. వేంపల్లిలో కమ్యూనిటీ ఆస్పత్రిని 30 పడకల నుంచి 50 పడకలకు పెంచుతున్నాం. పులివెందులలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు జరుగుతున్నాయి. 18 కొత్త దేవాలయాలు, 51 దేవాలయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వేంపల్లి ఉర్దూ కళాశాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పులివెందులలో మిగతా 2లో..

### ఏపీలో కరోనా కొత్త స్ట్రెయిన్ ఆనవాళ్లు లేవు

ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని



**అమరావతి, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** ఏపీలో కరోనా కొత్త స్ట్రెయిన్ ఆనవాళ్లు లేవని మంత్రి ఆళ్ల నాని ప్రకటించారు. రాజమండ్రిలో కరోనా సోకిన మహిళ శాంపిల్స్ పుణే పంపామని తెలిపారు. పుణే ల్యాబ్ నుంచి రిజల్ట్స్ కోసం వేచి చూస్తున్నామన్నారు. రాజమండ్రి మహిళ యూకే నుంచి వచ్చారు కాబట్టే అనుమానాలున్నాయని చెప్పారు. కరోనా కొత్త స్ట్రెయిన్‌తో ప్రజల్లో ఆందోళన మిగతా 2లో..

## జనవరి 1 నుంచి ఫాస్ట్యాగ్ తప్పనిసరి





**న్యూఢిల్లీ, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** టోల్ గేట్ల దగ్గర రద్దీని నియంత్రించాలన్న ఉద్దేశంతో క్యాష్ లెస్ సేవలను ప్రారంభించింది కేంద్ర ప్రభుత్వం.. దీని కోసం ఫాస్టాగ్ విధానాన్ని తీసుకొచ్చింది.. ఇప్పటికే అన్ని టోల్ గేట్లు దగ్గర నగదు రహిత సేవల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.. ఇదే సమయంలో.. నగదు చెల్లింపుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.. కానీ, ఇవి త్వరలోనే మాయం కాబోతున్నాయి.. ఇక ఎక్కడికి వెళ్లినా ఫాస్టాగ్ తప్పనిసరి.. ఈ నిబంధనలు త్వరలోనే అమల్లోకి రాబోతున్నాయి.. దీనిపై కేంద్ర రవాణా మరియు రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు.. 2021 జనవరి 1 నుండి దేశంలోని అన్ని వాహనాలకు ఫాస్టాగ్ తప్పనిసరి చేస్తున్నట్లు వెల్లడించారు నితిన్ గడ్కరీ.. నగదు చెల్లింపుల కోసం ఇక టోల్ గేట్ల దగ్గర ఆగాల్సిన అవసరం లేదు.. సమయం, ఇంధనం కూడా వృథా చేసుకోవాల్సిన అవసరం లేదని.. ఇది ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండబోతోందని తెలిపారు గడ్కరీ. అంటే.. వచ్చే ఏడాది ప్రారంభం నుంచే.. టోల్ గేట్ల వద్ద పన్నుల్ని వంద శాతం ఫాస్టాగ్ ద్వారానే వసూలు చేయనున్నారు.. కొత్త సంవత్సరంలో ఊరి కెళ్లాలనుకునే వారు ఇప్పుడే త్వరపడి ఫాస్టాగ్ చేయించుకుంటే మంచిది. ఫాస్టాగ్ విధానంలో వాహనాల విండ్‌స్క్రీన్‌పై ఉంచే ఫాస్టాగ్ స్టిక్కర్‌లో మిగతా 2లో..

### 30 లక్షల పేదలకు పట్టాల పంపిణీ, 15 లక్షల ఇళ్ల పనులు ప్రారంభం

– మంత్రి బొత్స



**అమరావతి, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** పేదలకు ఇళ్ల పట్టాలు శుక్రవారం పంపిణీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. చెప్పినట్టే పేదలకు ఇళ్లు కట్టిస్తున్నామని చెప్పారు. తమది చేతల ప్రభుత్వం అని మరోసారి స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని.. పేదల సంక్షేమమే తమకు ప్రయారిటీ అని తేల్చి చెప్పారు. ఇందులో సందేహానికి తావులేదని మిగతా 2లో..

**అంబేడ్కర్ రాజనీతి ఉద్యమం**

**Ambedkar Rajaneethi Movement (ARM)**

www.ambedkarrajaneethi.com

**బహుజనుల కోసం డిమాండ్లు**

1. మద్యపానాన్ని నిషేధించాలి
2. మహిళలకు అన్నింటా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి.
3. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలి.
4. న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు కల్పించాలి.
5. వెనుకబడిన తరగతులకు చట్ట సభల్లో 50 - రిజర్వేషన్ కల్పించాలి.
6. ఎస్సీ లకు మత స్వేచ్ఛ కల్పించాలి.
7. బుద్ధుడు ప్రవచించిన సమతా భావాన్ని సమర్థించేలా చర్యలు చేపట్టాలి.
8. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని కులాలకు రిజర్వేషన్ కల్పించాలి.
9. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.
10. రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలి.
11. అందరికి ఉచిత విద్య కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టాలి.
12. ప్రైవేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి.
    ఇప్పటికే ఉన్న ప్రైవేటు విద్యా సంస్థల్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలి.
13. ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం అందించాలి.
14. ప్రైవేట్ ఆస్పత్రులను రద్దు చేయాలి.
15. పరిశ్రమల్ని జాతీయం చేయాలి. ప్రైవేట్ రంగంలో నడిచే పరిశ్రమల్లో రిజర్వేషన్ కల్పించాలి.
16. ఆధార్ కార్డు ఉన్న ప్రతి పౌరుడికి 2,00,000/- రూపాయలు ఋణం ఇవ్వాలి.
    సక్రమ చెల్లింపుపై తరువాత సంవత్సరం రెట్టింపు ఋణం ఇవ్వాలి.
17. భూమిలేని రైతులకు ప్రభుత్వ/దేవాలయ లేదా ఇతరత్రా ఏదైనా 4 ఎకరాల భూమి ఇవ్వాలి.
18. ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలి.
19. వలసలను అరికట్టేందుకు ఎక్కడికి అక్కడే గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త సాంకేతిక వ్యవసాయ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
20. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చి సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి.
21. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలను ముందుగానే ప్రకటించాలి.

ఇటువంటి విలువైన అంశాలు ఇంకా ఏవైనా ఉంటే దయచేసి మా దృష్టికి తీసుకురండి.


**ఆహ్వానం**

అంబేడ్కర్ రాజనీతి ఉద్యమంలో భాగస్వాములుగా చేరేందుకు బహుజనులందరికీ ఆహ్వానం.

**జై భీం, జై ఫూలే, జై బహుజన**

సెంట్రల్ వర్కింగ్ కమిటీ
అంబేడ్కర్ రాజనీతి మూవ్ మెంట్


## కరోనాలో నెలకు రెండు జన్యుమార్పులు: ఎయిమ్స్ డైరెక్టర్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** కొత్త రూపం సంతరించుకున్న కరోనా మరోసారి ప్రపంచంపై తన ప్రభావం చూపెట్టేందుకు సిద్ధమైంది. అయితే..తొలి సంక్షోభం నాటి అనుభవాల సహాయంతో వివిధ దేశాలు వెంటనే అప్రమత్తమై వ్యాప్తిని నిరోధించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నాయి. బ్రిటన్‌లో తొలిసారిగా ఓ కొత్త వేరియంట్ బయటపడింది. దక్షిణాఫ్రికాలోనూ మరో కరోనా వేరియంట్ లేదా స్ట్రెయిన్ వెలుగు చూసిందని అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఈ అంశాలపై ఎయిమ్స్ డైరెక్టర్ డా. రణదీప్ గులేరియా జాతీయ మీడియాకు కూలంకషంగా వివరించారు. ఈ పరిమాణాలు చూసి అంతగా భయపడాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉంటూ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ ఉంటే సరిపోతుందని ఆయన భరోసా ఇచ్చారు. కరోనా వైరస్ ఉనికిలోకి మిగతా 2లో..

## మనకున్న పెద్దబలం అదే : ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

వెల్లారు. అంతేకాదు గుజరాతీలో ఆయన రెండు పద్యాలు కూడా రాశారు. భిన్న సంస్కృతులకు నెలవైన భారత్ గొప్పదనాన్ని, సుహృద్భావంతో కలిసి మెలిసి ఉండాల్సిన ఆవశ్యకతను వివరించేందుకే నేను ఈ ప్రస్తావన తీసుకువచ్చాను. భిన్న భాషలు, ఆహారపుటలవాట్లు, వేషధారణ కలిగి ఉన్నప్పటికీ అంతా ఐకమత్యంగా ఉండటమే మనకున్న అతిపెద్ద బలం. ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్‌కు నిదర్శనం" అని చెప్పుకొచ్చారు. అదే విధంగా ఠాగూర్ వదినమ్మే ఆధునిక చీరకట్టుకు ఆద్యురాలు అని పేర్కొన్నారు. కాగా బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, బీజేపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఔట్‌సైడర్లు అంటూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీ నేతలను ఉద్దేశించి విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ భిన్నత్వంలో ఏకత్వ భావన గురించి ప్రస్తావించడం గమనార్హం. ఇక ప్రధాని వ్యాఖ్యలపై స్పందించిన బెంగాల్ మంత్రి బ్రత్యా బోస్.. "ప్రధాని మోదీ చెప్పినట్లుగా గుజరాత్‌లో పనిచేసింది ఠాగూర్ పెద్దన్నయ్య కాదు. అలాగే ఆయన భార్య పేరు జ్ఞానదనందిని. ఆమె చీరకట్టు గురించి ప్రచారంలో ఉన్నవన్నీ కల్పితాలు మాత్రమే. అదే విధంగా విశ్వభారతి యూనివర్సిటీని జాతీయత అంశంతో ముడిపెట్టారు. మతాన్ని అడ్డుపెట్టుకుని జాతీయత గురించి మాట్లాడమని ఠాగూర్ ఎప్పుడూ చెప్పలేదు" అని విమర్శలు గుప్పించారు.

## రాక్షసత్వం నిండిన వ్యక్తి దేవుడి మీద ప్రమాణం చేయడమా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాణం చేయగలడు. తన భార్య మీద అయినా ప్రమాణం చేయగలడు. తన పిల్లల మీద అయినా ప్రమాణం చేయగలడు. ఎందుకంటే దేవుడు అంటే నమ్మకం లేదు. పాప భీతి లేదు కాబట్టే. వంగవీటి హత్య తర్వాత విశాఖకు పారిపోయి వచ్చాడు. విశాఖ వచ్చిన వెలగపూడి ఏం చేశాడంటే.. భూములు మేశాడు. పీకలు కోశాడు అని అనేక మంది చెబుతున్నారు. ఈయనకు బినామీ భూములు లేవని ప్రమాణం చేస్తాడా..? బినామీ భూములు లేకపోతే ఎందుకు ఉలికిపాటుకు గురి అవుతున్నాడు. ఎందుకు తన ఆస్తులన్నీ పోయినట్టు బాధపడుతున్నాడు? తనకు ఒక్క అంగుళం భూమి కూడా లేకపోతే బదులు తీర్చుకుంటానని ఎందుకు ప్రగల్భాలు పలుకుతున్నాడు? ఈ విషయాలన్నింటికీ అతనే సమాధానం చెప్పాలి. విశాఖపట్నంలో వెలగపూడి రామకృష్ణను ఎవరైనా ధర్మాత్ముడు అనుకుంటారా లేక ఒక గూండా, రౌడీ ఎలిమెంటుగా భావిస్తున్నారా..? రాక్షసత్వం నిండిన వ్యక్తి దేవుడి మీద ప్రమాణం చేయటం ఏమిటి? వినటానికి కూడా వెగటుగా ఉంది' అంటూ విజయసాయిరెడ్డి పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

**వెలగపూడి రియాక్షన్.. :** విజయసాయిరెడ్డి విడుదల చేసిన పత్రికా ప్రకటనపై వెలగపూడి రామకృష్ణ బాబు స్పందించారు. 'వంగవీటి రంగా కేసులో నేను నిర్దోషిని, నిర్దోషికి నిందితుడికి తేడా తెలియని నీవు, పలు కేసుల్లో ముద్దాయివి.. దయచేసి పత్రికా ముఖంగా చేసిన సవాల్‌ను, నీలో నిజాయితీ ఉంటే సవాల్ స్వీకరించాలి' అని కోరారు.

## జనవరి 1 నుంచి ఫాస్టాగ్ తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)

రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తారు. ఇది టోల్ ప్లాజాలోని స్కానర్‌కు నేరుగా కనెక్ట్ అవుతుంది. వాహనదారుల ఖాతా నుంచి డబ్బులు ఆటోమెటిగ్గా కట్ అవుతాయి. ఇప్పటికే ఫాస్టాగ్ లేని వాహనాలను మార్షల్ లైన్‌లోకి అనుమతించడం లేదు. జనవరి 1 నుంచి ఆ ట్యాగ్ లేకుండా అసలు ఏ లైన్‌లోకి వెళ్లే అవకాశం ఉండదు. వీటితో పాటు పాజిటివ్ పే సిస్టమ్, కాంటాక్ట్‌లెస్ కార్డు లావాదేవీల పెంపు, జీఎస్టీ రిటర్న్ వంటి నిబంధనలు అమల్లోకి రాబోతున్నాయి.. కాగా, టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించాలనే ఉద్దేశ్యంతో ఫాస్టాగ్ విధానాన్ని 2017 నుంచి కేంద్రం అమలు చేస్తుండగా.. 2019 అక్టోబర్‌లో దేశవ్యాప్తంగా.. ఈ విధానాన్ని తప్పనిసరి చేసింది. ద్విచక్ర, మూడు చక్రాల వాహనాలతో పాటు.. పాత వాహనాలకు ఫాస్టాగ్ నుంచి మినహాయింపు వచ్చింది. కానీ, జనవరి 1వ తేదీ నుంచి అన్ని నాలుగు చక్రాల వాహనాలకూ ఫాస్టాగ్ తప్పనిసరి అయ్యింది.

## కరోనాలో నెలకు రెండు జన్యుమార్పులు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన నాటి నుంచి వైరస్‌లో నెలకు రెండు జన్యు మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఆయన చెప్పారు. వైరస్‌లో ఇది నిరంతరంగా జరుగుతున్న ప్రక్రియ అని గులేరియా వివరించారు. కరోనా కొత్త రూపాలు.. అంటే వేరియంట్లు లేదా స్ట్రెయిన్లు రావడానికి ఇదే కారణమన్నారు. ఈ సందర్భంగా..యాంటీజెనిక్ డ్రిఫ్ట్, యాంటీజెనిక్ షిఫ్ట్ అనే రెండు పరిణామాల గురించి ఆయన వివరించారు. వైరస్ జన్యువుల్లో చిన్న చిన్న మార్పులు(మ్యూటేషన్లు) జరిగినప్పుడు మానవ రోగ నిరోధకశక్తి ప్రతిస్పందనల్లో పెద్ద తేడా ఉండదని, దీన్ని శాస్త్రవేత్తలు యాంటిజెనిక్ డ్రిఫ్ట్‌గా పిలుస్తారని డా.గులేరియా వివరించారు. అదే..వైరస్ జన్యువుల్లో భారీ మార్పులు సంభవించి..కొత్త వైరస్ పుట్టుకొస్తే..దాన్ని యాంటీజెనిక్ షిఫ్ట్ అంటారని గులేరియా తెలిపారు. కరోనా వైరస్ తొలిసారిగా ఈ విధంగానే ఉనికిలోకి వచ్చిందని తెలిపారు. అయితే..ప్రస్తుతం కరోనాలో వస్తున్న జన్యుమార్పులు యాంటిజెనిక్ షిఫ్ట్ అయి ఉండకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

## రోజుకు 30 వేల మందికి దర్శనాలు



**తిరుమల, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. 10 రోజులపాటు వైకుంఠ ద్వారాలు తెరుస్తున్నామని, రోజుకు 30 వేల మందికి దర్శనాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేపు ఉదయం 4 గంటలకు వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. ముందుగా వీఐపీ ప్రొటోకాల్, శ్రీవారి ట్రస్ట్ భక్తులకు అనుమతి ఉంటుందని, ఉదయం 7:30 నుంచి సామాన్య భక్తులకు దర్శనాలు కల్పిస్తామని చెప్పారు. భక్తులంతా కోవిడ్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని కోరారు.

# పులివెందుల రుణం ఎప్పటికీ తీరనిది

(మొదటిపేజీ తరువాయి)

మోడల్ పోలీస్ స్టేషన్ పనుల పురోగతి మరింత వేగవంతంగా సాగుతున్నాయి.

పునరావాసంకు రూ. 665 కోట్లు.. గండికోట రిజర్వాయర్‌పై కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మార్చిలో ప్రారంభిస్తాం. రూ.1256 కోట్లతో మైక్రో ఇరిగేషన్ పనులు చేపడుతున్నాం. శ్రీశైలంలో 881 అడుగులు ఉంటే తప్ప పోతిరెడ్డిపాడుకు పూర్తిస్థాయి నీటిసామర్థ్యం రాదు. గత 15 ఏళ్లలో లెక్కలు చూస్తే 20-25 రోజుల మాత్రమే పూర్తిస్థాయి నీరుంది. పులివెందుల ఆర్డీసీ డిపో పనులు డిసెంబర్ 25న ప్రారంభం కానున్నాయి. గండి వీరాంజనేయ క్షేత్రంలో గర్భాలయం, ధ్వజస్తంభం పునర్నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. గండికోటలో రిజర్వాయర్‌లో 26 టీఎంసీల పూర్తిసామర్థ్యాన్ని ఎప్పుడూ నింపలేదు. రూ.665 కోట్లతో పునరావాసం చెల్లించి 26.85 టీఎంసీల నీటిని నింపాం. రూ.247 కోట్లు కింద ఇచ్చి చిత్రావతిలో 10.13 టీఎంసీల నీటిని నింపాం. గండికోట, చిత్రావతి నిర్వాసితులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వారి త్యాగాల వల్లనే లక్షలాది రైతులకు మేలు జరుగుతుంది. నిర్వాసితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నాను. నిర్వాసితులు చిరునవ్వుతో ఉండేలా చర్యలు తీసుకోవాలి.' అని అన్నారు.



## 30 లక్షల పేదలకు పట్టాల పంపిణీ, 15 లక్షల ఇళ్ల పనులు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేశారు. పేద ప్రజల సొంతింటి కల శుక్రవారం నెరవేరబోతుందని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల 75 వేల మందికి ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తామని తెలిపారు. 15 లక్షల ఇళ్ల పనులను ప్రారంభిస్తున్నామని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇళ్ల పట్టాల పంపిణీలో సీఎం జగన్ పాల్గొంటారని బొత్స సత్యనారాయణ తెలియజేశారు. మిగతా చోట్ల మంత్రులు హాజరవుతారని వివరించారు. 2.62 లక్షల మందికి టిడ్కో ఇళ్లు ఇస్తామని ఆయన తెలిపారు. కొత్త లేఔట్లతో 17 వేల కొత్త గ్రామాలు రూపొందాయని చెప్పారు. కానీ ప్రతిపక్ష నేత చంద్రబాబు కోటరీ మాత్రం కోర్టులకు వెళ్లడం వల్ల ఆలస్యమైందని తెలిపారు. 23 వేల కోట్ల విలువైన భూములను పంపిణీ చేస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విశాఖ పట్టణంలోనే 1350 కోట్ల విలువైన 4457 ఎకరాలు పంపిణీ చేస్తామని వివరించారు. మిగతా చోట్ల కూడా విలువైన భూములను సేకరించామని పేర్కొన్నారు.

## కర్నాటకలో రాత్రి వేళ కర్ఫ్యూ ఎత్తివేత..



**కర్ణాటక, డిసెంబర్ 24 (ప్రజా పాలన :** కరోనా వ్యాప్తి నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం నైట్ కర్ఫ్యూ విధించిన సంగతి తెలిసిందే. డిసెంబరు 24 నుంచి జనవరి 1 వరకు రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు కర్ఫ్యూ అమలు చేయాలని భావించారు. ఈ మేరకు నిన్న ఆదేశాలు కూడా వెలువడ్డాయి. అయితే, తాజాగా మరోసారి సమీక్ష నిర్వహించిన అనంతరం కర్ణాటక ప్రభుత్వం నైట్ కర్ఫ్యూ ఆదేశాలను వెనక్కితీసుకుంటున్నట్టు ప్రకటించింది. నైట్ కర్ఫ్యూ విధించాల్సినంత పరిస్థితులు రాష్ట్రంలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ లేవని యెడియూరప్ప సర్కారు భావిస్తోంది. దీనిపై సీఎంఓ ఓ ప్రకటన చేసింది. నిపుణుల హెచ్చరికల మేరకు కరోనా కొత్త స్ట్రెయిన్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు ఇంతక్రితం నైట్ కర్ఫ్యూ ఆదేశాలు ఇచ్చాం. అయితే ప్రజానీకం నుంచి వస్తున్న స్పందనలతో మరోసారి సమీక్షించాం. దీనిపై కేబినెట్ సహచరులు, సీనియర్ అధికారులతో చర్చించి నైట్ కర్ఫ్యూ ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నాం అని వివరించింది. అయితే, ప్రజలు భౌతికదూరం, మాస్కులు, శానిటైజర్ల వినియోగం వంటి నిబంధనలు పక్కాగా పాటించాలని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

## సింహానికే వణుకు పుట్టించాడు!



**బోట్స్వానా, డిసెంబర్ 24 :** ఆకలితో ఉన్న ఓ వ్యక్తిని చంపుకుని తినాలనుకున్న సింహం మీద పిడిగుద్దులు కురిపించి సింహానికే వణుకు పుట్టించాడు. అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తున్న ఈ సంఘటన ఆఫ్రికా ఖండంలోని బోట్స్వానా దేశంలో జరిగింది. వన్యజాతుల అధ్యయనకారుడు గోట్స్ నీఫ్.. ఒకవాంగో డెల్టాలో టెంట్ వేసుకుని నిద్రిస్తున్నాడు. ఇంతలో ఏదో పెద్ద శబ్దం అతడికి చేరువ అవుతూ వచ్చింది. అదేంటని లేచి చూసేలోపే సింహం తన ఆకలిని తీర్చుకునేందుకు అతడి మీదకు పంజా విసిరింది. అతడి కేకలు విన్న నీఫ్ స్నేహితులు రైనర్ వాన్ బ్రాండీస్, టొమాలెట్స్ సెటబోష వారి ప్రాణాలను పణంగా పెట్టి సింహంతో పోరాడారు. చెట్టు కొమ్మలను విసురుతూ, చేతికందిన వస్తువులను విసురుతూ దాన్ని బెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయినా సరే అది నీఫ్‌ను వదిలేయకపోవడంతో అతడు దాని ముఖం మీద పిడిగుద్దులు కురిపించాడు. దీంతో ఆగ్రహించిన సింహం అతడి తలను నోట కరుచుకునేందుకు ప్రయత్నించగా చాకచక్యంగా తప్పించుకున్నాడు. కానీ అతడి మోచేతిని మాత్రం తన కోర పళ్లతో కొరకడంతో తీవ్ర గాయమైంది. అయినా సరే నీఫ్, అతడి స్నేహితులు ధైర్యంగా సింహంతో పోరాడి దాన్ని అక్కడ నుంచి పారిపోయేలా చేశారు. తీవ్ర గాయాలతో ప్రాణాలతో బతికి బయటపడ్డ నీఫ్ ఆస్పత్రిలో చేరగా అతడి మోచేతి ఎముకలు విరిగినట్లు తెలిపారు.

## ఏపీలో కరోనా కొత్త స్ట్రెయిన్ ఆనవాళ్లు లేవు

(మొదటిపేజీ తరువాయి)

ఉందని, ప్రజలెవరూ భయాందోళన చెందొద్దని మంత్రి సూచించారు. విమానాశ్రయాల్లో ప్రత్యేక బృందాలు నియమించామని ఆళ్ల నాని తెలిపారు.

మరోవైపు కరోనా సెకండ్ వేవ్ హెచ్చరికల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. కేంద్ర మార్గదర్శకాలను అనుగుణంగా ప్రత్యేక చర్యలు చేపట్టింది.

# ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

### ప్రజా సైన్సు వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ముచ్చుకోట సురేష్ బాబు

**అనంతపురం, డిసెంబర్ 24 (ప్రజా పాలన) :** వినే వాడు వెర్రి వెంగళప్ప యితే హరి కథ చెప్పే వాడు పడుకొని చెప్తాడు. వెనకటికి టోపీ పెట్టె వాడంటే తెలుగులో మోసపోయిన వారని, జ్యూసు పిండుతున్నారంటే ప్రజలని నిలువునా దోచుకుంటున్నారని అర్థం. ఇప్పుడు అదే పేర్లతో వైట్ హ్యాట్ (తెల్ల గుడ్డ), బై జ్యూస్ ( అంటే రెండు సార్లు జ్యూస్ పిండడం) పేర్లతో మధ్యతరగతి ప్రజల తల్లితండ్రులకు తెల్ల టోపీ పెట్టి జ్యూసు పిండడానికి చాల యాప్ లు వస్తున్నాయి. ఈ మధ్యనే ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ప్రాంగణ నియామకాల్లో ఆఖరి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇలాంటి జ్యూసు పిండే కంపెనీలలో టెలి కాలర్స్ గా నియమితులయ్యారని ఆ కళాశాల యజమాన్యం పేపర్ ప్రకటనలు ఇచ్చింది. ఇంజినీరింగ్ విద్యార్థులకు టెలి కాలర్ ఉద్యోగానికి, వీధుల్లో గొడుగులు పెట్టుకొని సిమ్ కార్డులమ్మే బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగానికి, లోన్లు ఇస్తామని, ఇన్సూరెన్స్ చేయమని ప్రొద్దున ఏడు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు వినియోగదారులతోహా ఫోన్‌లో మాట్లాడే ఉద్యోగానికి ఏమైనా సంబంధముందా? ఈ ప్రాంగణ నియామకాల ప్రకటన చూసి చాల మంది తల్లితండ్రులు వందశాతం ప్లేసుమెంట్ ఉన్న కళాశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు. ఇంగ్లీషులో ఒక సామెత ఉంది ఒక ఆశావాది విపత్తులో తనకేమొస్తుంది అని చూస్తాడు, ఒక నిరాశావాది వచ్చిన అవకాశంలో విపత్తును వెతుకుతాడు నిన్ననే ఒక జ్యుసు కంపెనీ నుండి ఫోన్ వచ్చింది - సార్ మేము ద్విజ్యూస్ కంపెనీ నుండి ఫోన్ చేస్తున్నాము మేము లక్ష్మి తండ్రి గారితో నేన మాట్లాడేది అన్నాడు, అవును నేను లక్ష్మి వాళ్ళ నాన్నను మాట్లాడుతున్నాను అన్నాను. సార్ మా దగ్గర ఒక ప్యాకేజి ఉంది మీ అమ్మాయికి పదవ తరగతి వరకు మేము ఆన్లైన్ ట్యూషన్ చెపుతాము, మాములు సందర్భాల్లో అయితే లక్షన్నర కాని కోవిద్ మూలంగ మేము తొంభై వేలకు ప్యాకేజి ఫిక్స్ చేసాము డిసెంబరు 30 వ తారీఖు లోగా ఎన్రోల్ చేసుకోండని గ్రుక్క త్రిప్పకుండా మాట్లాడాడు. బాబు మా అమ్మాయి లక్ష్మి పెండ్లి పదమూడు సంవత్సరాల క్రింద జరిగింది ఆమెకు ఇప్పుడు ఏడవతరగతి చదువుతున్న కూతురు జాహ్నవి ఉందని సమాధానమిచ్చాను, వెంటనే అటువైపు నుండి మేము మీ మనవరాలు జాహ్నవి కోసమే ఫోన్ చేసాము సార్ అని సమాధానమిచ్చాడు. ఓకే మరి మా మానవరాలుకు జనరల్ సైన్సు, మాథెమటిక్స్ , సోషియల్ , ఇంగ్లీష్ ఏమైనా నేర్పుతారా అని అడిగాను. అలాంటివి ఏవి నేర్పము సార్, మేము మీ అమ్మాయికి పైథాన్, జావా, కోడింగు, టెస్టింగు లాంటివి ఇప్పుడు ఐ టి లో ఉపాధిఅవకాశాలకు అవసరమైన స్కిల్స్ ఇస్తాము అంతే కాకుండా వీరికి టైం మేనేజిమెంట్, స్ట్రెస్ మేనేజిమెంట్, కాన్ఫ్లిక్ట్ మేనేజిమెంట్ పై అదనంగా తర్ఫీదు ఇస్తామని సమాధానమిచ్చాడు. అయినా మా మనవరాలు ఏడవ తరగతి ఆమెకెందుకు కోడింగ్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ అని సంశయిస్తూ అడిగాను. అతను మీకు తెలియదా కేంద్రం ప్రవేశ పెట్టిన నూతన విద్య విధానంలో ఇదే ఉంది మేము ఇంతకంటే ఎక్కువ చెప్పాలని అనుకున్నాము అని సమాధానమిచ్చాడు. ఇది వింటున్న మా అల్లుడు ఏంది మామ ఇంతసేపు డిస్కషన్ డిసెంబరు 30 లోపు డబ్బు ట్రాన్స్ఫర్ చేస్తే పోలా. ఇప్పుడున్న పరిస్థితిలో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ లైబ్రరీ, అలాగే పుస్తకాలతో నేస్తం పథకాల వల్ల కలెక్టివ్ రీడింగ్ అబ్బింది. కొంత మేరకు నాడు నేడు వలన పాఠశాలల్లో ఇన్ఫ్రాస్ట్రక్చర్ పెరిగింది. ఇంగ్లీష్ మాధ్యమం వలన లోయర్ మిడిల్ క్లాస్ వారు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో కంటిన్యూ చేస్తున్నారు. ఇప్పుడు కూడా ప్రైవేటు, కార్పొరేటుహా స్కూళ్లల్లో పుస్తకాల పేరుతో, ఆన్లైన్ క్లాసుల పేరుతో వేలకు వేలు డబ్బు గుంజుతున్నారు. గొర్రె ఎప్పుడూ కసాయి వాడినే నమ్ముతుంది అనడానికి నిదర్శనం. మన వెర్రి వెంగళప్పలు కార్పొరేటు స్కూళ్ల ద్వారానే ఉత్తమ విద్య వస్తుందని దృడంగా నమ్ముతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి మెరుగైన సౌకర్యాలు కల్పించి, ఉత్తమ పౌరసమాజ నిర్మాణంలో భాగస్వామ్యులు అవుతారని కోరడమైనది.

## టిడ్కో ఇండ్లను లబ్ధిదారులకు ఉచితంగా అందించాలి

**– సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు**



**జగ్గయ్యపేట – (ప్రజాపాలన) :** రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి ఇండ్ల స్థలాలలో పంపిణీ ప్రకటనలో భాగంగా జగ్గయ్యపేట పట్టణం టిట్కో ఇండ్ల లబ్దిదారులతో కట్టించుకున్న డబ్బులను తిరిగి వారికి అందించి,ప్రతి ఒక్కరికి ఎటువంటి బ్యాంకు అప్పులు లేకుండా ఉచితంగా పేద లబ్దిదారులకు అందించాలని సిపిఐ జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు ప్రభుత్వాని పత్రికా ముఖంగా కోరారు. ఇప్పటికే పట్టణ ప్రాంతంలో సెంటు స్దలాని రెండు సెంట్లుగా ఇవ్వాలని,గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల స్థలాని పేదలకు ప్రభుత్వం అందించాలని ఆయన తెలియజేసారు.లబ్ధిదారులకు అందిస్తున్న ఇండ్లు,ఇండ్ల స్థలాల వద్ద త్రాగు నీరు,ట్రీట్ లైట్స్,కరెంట్,రోడ్లు,డ్రైనేజి లాంటి మౌలిక సదుపాయలను ఏర్పాటు చేయాలని, పాత్రికేయులకు కూడా ఈ సంధర్భంలోనే ఇండ్ల స్థలాలను ఇవ్వాలని సిపిఐ జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు ప్రభుత్వాని డిమాండ్ చేసారు.

# రూ కోటితో కిడ్నీ బాధితులకు ఉచిత దయాలసిస్

**జగ్గయ్యపేట – (ప్రజాపాలన) :** జగ్గయ్యపేట పట్టణం ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రైవేట్ బాగస్వామ్యంతో ఫిబ్రవరి 2020 న ప్రారంభించబడిన అపోలో దయాలసిస్ సెంటర్ ని ప్రధాన మంత్రి దయాలసిస్ ప్రోగ్రాం క్రింద ఏర్పాటు చేయడం జరిగింది.ఈ దయాలసిస్ సెంటర్ నుండి కిడ్నీ రోగగ్రస్తులకు వైయస్ఆర్ ఆరోగ్య శ్రీ క్రింద ఉంచితంగా ప్రభుత్వం అందిస్తుంది. ఒక్కసారి కిడ్నీ దయాలసిస్ చేస్తే గల ప్రభుత్వం అపోలో సంస్థకి సుమారు 1200 రూపాయల చెల్లిస్తుందని, బ్లడ్ లెవల్ ఇంజక్షన్ కొరకు సుమారు 1000 రూపాయలను ప్రభుత్వం పేషెంట్ కి ఉచితంగా అందిస్తుంది.ఇప్పటికే సుమారు 87 మంది కిడ్నీ బాదితులు నేటికి 4700 సార్లు దయాలసిస్ చేయించుకోవడం జరిగిందని, దయాలసిస్ చేసుకుంటున్న వారిలో సుమారు 18 మంది మరణించారని, ఎక్కువ శాతం జగ్గయ్యపేట నియోజక వర్గ ప్రాంతం నుండి సుమారుగా 78 మంది డయాలసిస్ తీసుకుంటున్నారని,కోవిడ్ సంధర్భంగా జగ్గయ్యపేట, నూజివీడు ప్రాంతంలో మాత్రమే కృష్ణా జిల్లాలో దయాలసిస్ చేయడం జరిగిందని సిబ్బంది తెలియజేసారు.దయాలసిస్ కి గురౌతున్న వారు సుమారు 35 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల పైబడి వయస్సున్న వారే ఉంటున్నారని సమాచారం తెలుస్తుంది. దయాలసిస్ సెంటర్ నుండి ఇప్పటికే సుమారు 60 లక్షల రూపాయలను ప్రధాన మంత్రి దయాలసీస్ ప్రోగ్రాం క్రింద అపోలోకి చెల్లించటం జరిగిందని,ఉచిత బ్లడ్ ఇంజక్షన్ ల కోసం సుమారు 50 లక్షల రూపాయల ప్రభుత్వం ఖర్చు చేయటం జరిగిందని,మ్మెత్తం మీద జగ్గయ్యపేట అపోలో దయాలసిస్ సెంటర్ నుండి సుమారు ఒక్క కోటి పది లక్షల రూపాయలను ప్రభు త్వం కిడ్నీ దయాలసిస్ బాధితులకు ప్రభుత్వం అందించటం జరిగిందని భావించవచ్చు. జగ్గయ్యపేట ప్రాంతంలో నీరు, గాలి పొల్యూషన్ వల్లో లేక ఏపి మద్యం త్రాగటం వల్లో లేక జన్యూ పరమైన సమస్యల వల్లో ఏమోగాని దయాలసిస్ కేసులలో సుమారు ప్రతి రెండు వేల మందిలో ఒక్కరికి కిడ్నీ దయాలసిస్ బాదితు లుండటం బాధాకరమని ప్రజలు బావిస్తున్నారు. కిడ్నీ బాదితుల సంఖ్యను తగించటానికి ప్రభుత్వం పరిశీలించి, దానికి గల కారణాలను విచారించి, కిడ్నీ రోగాలకు ప్రజలు గురి కాకుండా చూడాలని,ప్రజల ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్దని వహించాలని ప్రభుత్వానికి సామా జిక కార్యకర్త మెటికల శ్రీనివాస రావు తెలియజేసారు.



## యువత క్రీడ రంగంలో రాణించాలి



**మంత్రాలయం, ప్రజాపాలన :** మంత్రాలయం యువత క్రీడ రంగంలో రాణించాలని వైఎస్ఆర్ సిపి మండల అధ్యక్షుడు జి .భీమరెడ్డి గురువారం మండల పరిధిలోని చెట్నేహల్లి గ్రామంలో మారెమ్మ దేవర. తిక్కతాత ఉరుసు సందర్భంగా గ్రామ వైఎస్ఆర్ సిపి నాయకులు వెంకటేష్. మల్లికార్జున ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు ప్రారంభించడానికి రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు జి. భీమారెడ్డి హాజరయ్యారు ముందుగా గ్రామంలోని యువత, నాయకులు అందరూ కలిసి క్రీడ మైదానము వరకు ఊరేగింపుగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వాలీబాల్ పోటీలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషం దాయకం అన్నారు ఈ పోటీలలో గెలుపొందిన విజేత లకు మొదటి బహుమతి 5000 .ద్వితీయ బహుమతి రూ 3000 అందజేయడం జరుగుతుంది అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు రాజు.భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెరియార్ ఇవి రామస్వామికి నివాళులర్పించిన మాల మహానాడు



**అవనిగడ్డ (ప్రజాపాలన) :** పెరియార్ ఇ.వి రామస్వామి కి ఘనంగా నివాళులర్పించిన మాల మహానాడు. అవనిగడ్డ మండలం సీతాయలంక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పెరియార్ ఇవి రామస్వామి 47వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాలమహానాడు నేతలు. ఈ సందర్భంగా మాల మహానాడు కృష్ణాజిల్లా ఇన్చార్జ్ దోవా గోవర్ధన్ మాట్లాడుతూ దేశంలో మానవ మనుగడకు విగాతమైన మత మూర? విధానాలను ఎదిరించి సమాజానికి దూరంగా నెట్టి వేయబడ్డ ప్రజలకు అండగ సాంఘిక అసమానతలపై పోరాడిన మహా యోధుడు పెరియర్ రామస్వామి అని పెరియార్ స్ఫూర్తిని కొనియాడారు. పూలే అంబేద్కర్ పెరియార్ ల మేధోపరమైన ఆలోచనా విధానం సామాజిక స్వేచ్ఛ పోరాటల ఫలితంగానే నేడు దేశంలో అన్ని వర్గాల ప్రజలు సోదర భావంతో జీవిస్తున్నారని దేశ ప్రజలు వారి త్యాగాలను కొనియాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అవనిగడ్డ మండల కన్వీనర్ మేడికొండ నరేంద్ర. మేడికొండ హర్ష. వంశీ. మహేంద్ర. వినయ్. మేడికొండ రాజు. సురేష్. దోవారి కుటుంబ రావు. తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో బదిలీ ప్రక్రియపూర్తి

**సి. యమ్. డి పద్మా జనార్ధన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన ఉద్యోగ సంఘాలు**





**నరసరావుపేట, ప్రజాపాలన :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాల కు అనుగుణంగా విద్యుత్ శాఖ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధి సి. యమ్. డి పద్మా జనార్ధన్ విద్యుత్ వినియోగదారులకు సేవ చేసి వారికి సంబంధించిన అన్ని పనులు ఒకే కార్యాలయంలో అందుబాటులో ఉండాలి అని సబ్ ఈ ఆర్ ఓ ల నిర్మాణం జూనియర్ అసిస్టెంట్ ను సెక్షన్ పరిధిలో పనిచేసే ప్రక్రియ చెప్పట్టారు. ఈ ప్రక్రియ లో భాగంగా ఉద్యోగుల కు బాధ్యతలు అప్పగించారు, తదుపరి కొంతమంది ఉద్యోగులు తమకి బదిలీలు కావాలి అని అర్జీలు పెట్టుకోవడం జరిగింది ఈ విధంగా అందరికీ బదిలీలు జిల్లాల వారిగా ఇవ్వడంతో ఉద్యోగులు మరియూ ఉద్యోగ సంఘాల వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ జి-445 భారతీయ మాజ్దూర్ సంఘ్ అనుబంధ సంస్థ డిస్కం ప్రెసిడెంట్ ఆర్ .బంగారయ్య, కార్యదర్శి మోషే రాజు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన అన్ని అంశాలపై అనుకూలంగా అదేశాలు జారీ చేస్తున్న సి. యమ్. డి పద్మా జనార్ధన్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు వీరి నేతృత్వంలో ప్రతి ఒక్క ఉద్యోగి సంతోషం గా ఉన్నారు అని, అంతే కాకుండా ప్రతి ఒక్క విద్యుత్ ఉద్యోగి సంస్థ అభివృద్ధి కోసం పనిచేసి సి. యమ్. డి పద్మా జనార్ధన్ రెడ్డి కి మంచి పేరు తీసుకురావాలని కోరారు.


## సెయింట్ ఆన్స్ అధ్యాపకురాలు గ్రంధి ప్రసూనకు డాక్టరేట్



**వేటపాలెం, ప్రజాపాలన :** సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి చీరాలలో సి ఎస్ సి విభాగంలో అధ్యాపకురాలు పనిచేస్తున్న శ్రీమతి జి. ప్రసూనకు పి.హెచ్.డి. డిగ్రీ పొందినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పొగడదండ రవికుమార్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకురాలు గ్రంధి ప్రసూనకు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయము వారి పి.హెచ్.డి ప్రధానము జరిగిందన్నారు. మాచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన డాక్టర్ ఓ నాగరాజు గారి అధ్వర్యములో "ఆప్టిమైజేషన్ ఆఫ్ టెస్టింగ్ టైమ్ యూజింగ్ నావెల్ టెస్ట్ కేస్ జనరేటర్ అండ్ కోడ్ ఎగ్జిక్యూషన్ ఆప్టిమైజేషన్ యూజింగ్ హాట్ పాత్ ఇన్ సాఫ్ట్ వేర్ కాంపోనెంట్ " అనే అంశం పై పరిశోధన గావించి పి.హెచ్.డి డిగ్రిని పొందారన్నారు. ఈ పరిశోధన సాఫ్ట్ వేర్ టెస్టింగ్ ఉపయోగ పడుతుందన్నారు. పి.హెచ్.డి డిగ్రీ పొందిన సందర్భముగా డాక్టర్ గ్రంధి ప్రసూనను కళాశాల యాజమాన్యం, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. అలగే ప్రస్తుతం తమ కళాశాలలో 43 మంది వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పి.హెచ్.డి లు పొందిన ప్రొఫెసర్ లు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సి.యస్.ఇ విభాగాధిపతి డాక్టర్ పి. హరిణి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ తరలిస్తున్న మద్యం సీసాలు స్వాధీనం

**రొంపిచర్ల, ప్రజాపాలన :** రొంపిచర్ల మండలంలో గోగులపాడు గ్రామంలో 600 మద్యం సీసాలు బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు ఆ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న గాసి సాయిరామ్ ఇంటిపై దాడి చేసి 600 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ ఐ పి.హజరత్తయ్య తెలిపారు. సాయిరామ్ నకరికల్లు మండలంనుండి అక్రమంగా మద్యం అమ్ముతున్నారని అన్నారు. అతని వద్ద నుండి 600 మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని స్టేషన్ కు తీసుకెళ్ళామని అన్నారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ హాజరత్తయ్య తెలిపారు.



# క్రీస్తు పుట్టుక సర్వమానవాళికి పండుగ

**– పాస్టర్ ఉప్పలపాటి ప్రేమరాజు**



**రొంపిచర్ల, ప్రజపాలన :** స్థానిక రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు లోని అంబేద్కర్ కాలనీలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు పరిశుద్ద పౌలు లూథరన్ దేవాలయ యూత్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ 17వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా పాల్గొన్న సంఘకాపరి రెవ.ఉప్పలపాటి ప్రేమరాజు ,ఉప్పలపాటి హెప్సిబా ప్రేమరాజు పాల్గొని ఏసుక్రీస్తు పుట్టుక సందేశాన్ని అందించారు. ఒకరిపట్ల ఒకరు ప్రేమ,దయ,కరుణ కలిగి ఉండాలని ఏసుక్రీస్తు పుట్టుక సర్వమానవాళికి పండుగరోజని ఏసుక్రీస్తు లోకంలో మనం చేసిన పాపముల నుండి మనల్ని రక్షించేందుకు ఈలోకానికి రావడం జరిగిందని తెలిపారు.అనంతరం సండేస్కూల్ విద్యార్థులు యేసుక్రీస్తు పుట్టుకను వివరిస్తూ చేసిన నృత్యాలు మరియు క్రిస్మస్ తాత వేషధారణ ,పలు నాటికలు అందరినీ అలరించాయి. పరిశుద్ధపౌలు లూథరన్ దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు.అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేకును కోసి అందరికీ పంచిపెట్టి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సంఘస్తులు, సంఘపెద్దలు, కమిటీ వారు, స్త్రీల సమాజం వారు, యూత్, సండే స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రజాపాలన
సంపాదకీయం
శుక్రవారం 25 డిసెంబరు 2020

# వేగంగా పెరుగుతున్న జపాన్ మిలిటరీ బడ్జెట్

వరుసగా తొమ్మిదవ సంవత్సరం జపాన్ తన మిలిటరీ బడ్జెట్‌ను పెంచింది. 2021 ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చే ఈ పెంపుదల 52 బిలియన్ డాలర్లకు చేరింది. అమెరికాతో రక్షణ ఒప్పందం వుండి, ఆత్మరక్షణకు మాత్రమే పరిమిత ఆయుధాలు, ఏర్పాట్లు వుండాల్సిన జపాన్ పూర్తి స్థాయిలో యుద్ధానికి వినియోగించే జెట్ బాంబర్లు, దీర్ఘశ్రేణి క్షిపణులను, యుద్ధ నౌకలు, విమానవాహక యుద్ధ నౌకలను సమకూర్చుకుంటున్నది. ఆత్మ రక్షణకు రక్షణ పేరుతో జరుగుతున్న ఈ చర్యలు ఆ ప్రాంతంలోని రష్యా, చైనాలను రెచ్చగొట్టేందుకు, ఆయుధ పోటీకి దారితీయవచ్చని భావిస్తున్నారు. తాజా పెంపుదలతో ప్రపంచంలో మిలిటరీ బడ్జెట్ అగ్ర దేశాలలో జపాన్ పదవ స్థానానికి చేరింది. రెండవ ప్రపంచ యుద్ధంలో మిత్ర రాజ్యాల చేతుల్లో ఓడిపోయిన జపాన్ మరోసారి మిలిటరీ శక్తిగా ఎదగకుండా చూసేందుకు మిలిటరీని రద్దు చేస్తూ పోట్స్ డామ్ సమావేశం నిర్ణయించింది. శాంతి ఒప్పందం ప్రకారం జపాన్ ఇతర దేశాలతో రక్షణ ఒప్పందాలు చేసుకోవచ్చు, ఆత్మరక్షణ చర్యలు తీసుకోవచ్చు. అయితే తరువాత అమెరికా తన షరతుల మేరకు జపాన్‌తో రక్షణ ఒప్పందాన్ని రుద్దింది. దాని ప్రకారం జపాన్‌లో అమెరికా మిలిటరీ తిష్టవేసింది.

అయితే ఇంతవరకు ఏ దేశమూ జపాన్ మీద దాడి చేయలేదు. అలాంటి సూచికలు కూడా లేవు. అయినా గత కొద్ది సంవత్సరాలు జపాన్ తన మిలిటరీ శక్తిని పెంచుకుంటూ వస్తోంది. అమెరికాతో రక్షణ ఒప్పందాన్ని రద్దు చేసుకొని స్వతంత్ర మిలిటరీ శక్తిగా ఎదగాలనే డిమాండ్ కార్పొరేట్ శక్తుల నుంచి పెరుగుతోంది. ఇదే సమయంలో తన కంటే మెరుగైన ఆర్థిక స్థితిలో ఉన్న జపాన్‌ను ఒక వైపు తమ అదుపులో ఉంచుకుంటూనే దానికి తమ ఆయుధాలను అమ్మి సొమ్ము చేసుకోవాలనే ఎత్తుగడను అమెరికా యుద్ధ పరిశ్రమ ముందుకు తెచ్చినట్లు కనిపిస్తోంది. ఇదే అదునుగా భావించి ఆయుధాల కొనుగోలుతో పాటు స్వంతంగా ఆయుధాల తయారీకి జపాన్ శ్రీకారం చుట్టింది. గతంలో వాణిజ్యం విషయంలో వివాద పడి సర్దుబాటు చేసుకున్న ఈ రెండు దేశాల మధ్య మిలిటరీ చర్యలు ఏ పర్యవసానాలకు దారితీస్తాయెా చూడాలి. అమెరికా నాయకత్వాన ఆస్ట్రేలియా, భారత్‌తో కలసి చతుష్టయం పేరుతో జపాన్ ఒక మిలిటరీ కూటమి ఏర్పాటుకు అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. మిలిటరీ బడ్జెట్ పెంపు దీనిలో భాగమే అని భావిస్తున్నారు.

ప్రస్తుతం అమెరికా నుంచి క్షిపణులు, విమానాలు కొనుగోలు చేస్తున్నప్పటికీ స్థానికంగా తయారీకి కూడా ప్రాజెక్టులను ప్రారంభించింది.

కొద్ది మంది సిబ్బందితో దాడులు చేయ గలిగిన రెండు యుద్ధ నావల తయారీకి 91 కోట్ల డాలర్లను బడ్జెట్‌లో కేటాయించారు. క్షిపణుల తయారీ లేదా కొనుగోలు ఇతర దేశాల మీద దాడులకు ఉద్దేశించినవి, ఆత్మరక్షణ విధానానికి అనుకూలమైన రాజ్యాంగానికి వ్యతిరేకమైన పరిణామాలని జపాన్ ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దేశ నైరుతి దీవుల చుట్టూ చైనా నౌకా దళ కార్యకలాపాలకు స్పందనగా, దేశ ఆత్మరక్షణ దళాల రక్షణ కోసం క్షిపణులు కీలకమని రక్షణ మంత్రి నోబు కిషి సమర్థించుకున్నారు. ఐదు సంవత్సరాలలో యుద్ధ నావల నిర్మాణం, క్షిపణి పరిశోధనలు పూర్తవుతాయని, ఇప్పటికే 900 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను తాకే వాటిని అభివృద్ధి చేసినట్లు చెబుతున్నారు. తమ గగనతలంపై ఎగిరే సూపర్‌సోనిక్ విమానాలను పసిగట్టేందుకు అవసరమైన టెలిస్కోప్‌లు, పర్యవేక్షణ వ్యవస్థల పరిశోధనలకు నిధులు కేటాయించారు. టోకియో లోని టకుషోకు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ హెయిగో నాగీ మాట్లాడుతూ స్వయం రక్షణకు జపాన్ మరింత బాధ్యత వహించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ఒత్తిడి కూడా మిలిటరీ బడ్జెట్ పెంపుదలకు ఒక కారణం అన్నారు. రక్షణ బడ్జెట్ పెంచకూడదనే రోజులు పోయాయన్నారు.

నాటో కూటమి ఖర్చులో ఎక్కువ మొత్తాన్ని ఐరోపా దేశాలు భరించాలని ఒత్తిడి చేసినట్లే...జపాన్‌తో రక్షణ ఒప్పందం ఉన్నప్పటికీ రక్షణ బడ్జెట్ పెంపుదల ఒత్తిడి వెనుక అమెరికా యుద్ధ పరిశ్రమల ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది. జపాన్‌కు వంద ఎఫ్-35 రకం యుద్ధ విమానాలను విక్రయించాలని జూలై నెలలో నిర్ణయించారు. పలు అమెరికా ఆయుధ పరిశ్రమలు జపాన్ ఆయుధ తయారీలో భాగస్వాములు కావాలని చూస్తున్నాయి. కరోనాకు ముందే అమెరికా ఆర్థిక వ్యవస్థ సమస్యలను ఎదుర్కొంటుండగా కరోనా కాలంలో తీవ్రంగా దెబ్బ తిన్నదని...అందువలన తూర్పు ఆసియాలో తన తరఫున ప్రాంతీయ భద్రతా పెంపుదల చర్యలకు జపాన్ ఎక్కువగా ఖర్చు చేయాలనే ఒత్తిడి పెంచుతున్నట్లు భావిస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత గణనీయంగా పుంజుకున్నప్పటి నుంచి తిరిగి ప్రపంచ రాజకీయాల్లో పాత్ర పోషించటం ద్వారా తమ మార్కెట్‌ను పెంచుకోవాలని జపాన్ చూస్తోంది. దానికి మిలిటరీ శక్తి ఒక సాధనం అన్నది తెలిసిందే. దానిలో భాగంగానే కార్పొరేట్లు రాజ్యాంగాన్ని సవరించి పూర్తి స్థాయి మిలిటరీని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎప్పటి నుంచో ఒత్తిడి తెస్తున్నాయి. అయితే రక్షణ ఒప్పందం పేరుతో తన గుప్పెట్లో ఉన్న జపాన్ మరోసారి తనకు పోటీనిచ్చే మిలిటరీ శక్తిగా ఎదగాలని అమెరికా కోరుకోవటం లేదు. ఆసియాలో తన అనుయాయిగా ఉంచుకొనేందుకే ప్రాధాన్యత ఇస్తున్నది. గతంలో ఒక సామ్రాజ్య శక్తిగా పెత్తనం చేసినపుడు లబ్ధి పొందిన కార్పొరేట్లు అమెరికా, ఇతర దేశాల నుంచి ఆయుధాల కొనుగోలుకు బదులు తామే వాటిని తయారు చేసి లబ్ధి పొందాలని చూస్తున్నాయి. ఇప్పుడు చైనా, ఉత్తర కొరియాలను బూచిగా చూపి తమ మిలిటరీ బడ్జెట్‌ను పెంచుకుంటున్నాయి. ఒక వైపు అమెరికా మరోవైపు స్వంత కార్పొరేట్ల ఒత్తిడిని అక్కడి పాలకవర్గం ఏ విధంగా సమన్వయ పరుస్తుందో చూడాల్సి ఉంది. ఇప్పటికిప్పుడు అమెరికాను తోసిరాజనే స్థితి లేనప్పటికీ దానికి బాటలు వేస్తోందన్నది బడ్జెట్ కేటాయింపులే చెబుతున్నాయి.

# అణచివేతలు అంతం కావాలి!

భారతదేశంలో అందరూ అంగీకరించే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకిక, రిపబ్లిక్ భావనల ఆధారంగానే రాజ్యాంగాన్ని రచించారు. ఈ భావనల అమలులో ఫ్యూడల్ సంబంధాలు, మనుస్మృతి అడ్డంకిగా మారాయి.

**అంటరానితనం – హింస**

చట్ట ప్రకారం అంటరానితనం పూర్తిగా నిషేధమని రాజ్యాంగం లోని ఆర్టికల్ 17 చెపుతుంది. కానీ ప్రస్తుత పరిస్థితి ఏమిటి? అంటరానితనం అనేక రూపాల్లో వేల గ్రామాల్లో ప్రబలిపోతోంది. దళితులు ఈ దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి, తమ హక్కుల గురించి పునరుద్ఘాటిస్తే, కులాధిపత్య శక్తులు వారిని విపరీతంగా కొట్టి, నరమేధాన్ని సృష్టించి, వారి గుడిసెలను తగులబెట్టి, ఆస్తులను ధ్వంసం చేసి, మహిళలపై అత్యాచారాలకు కూడా పాల్పడుతున్నారు. ఇప్పటికీ కులాంతర వివాహాలకు వ్యతిరేకత ఉంది. సామాజికంగా కఠినమైన షరతులను అంగీకరించని వారిని పరువు కోసం హత్య చేస్తున్నారు. ఒక దళితుడు హిందూ మహిళను ప్రేమించి పెళ్లి చేసుకుంటే, ఆధిపత్య కుల శక్తులు అతన్ని అనాగరికంగా హత్య చేయడం మనం దేశంలో తరచుగా చూస్తున్నాం. ఇతర కులాలకు చెందిన వారిని పెళ్లి చేసుకుంటున్న దళితులే ఎక్కువ సంఖ్యలో హత్యలకు గురవుతున్నారు.

**రాజకీయాధికార నిరాకరణ**

నేటికి కూడా, దళితులకు ప్రజాస్వామిక హక్కులను, రాజకీయ అధికారాన్ని కల్పిస్తే, కులాధిపత్య శక్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా పంచాయతీ సర్పంచ్‌లుగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోబడిన దళితులు తమ స్థానంలో (కుర్చీలో) కూర్చునేందుకు అనుమతించని పరిస్థితి. ఆర్థిక, జీవన స్థితిగతులలో పెద్దగా తేడాలు లేకపోయినప్పటికీ, కులాధిపత్య శక్తులు సృష్టించే వరుస సంఘటనల్లో దళితులు, వెనుక బడిన కులాలకు చెందిన ప్రజలు తగువులాడుకుంటున్నారు. దళితులతో పాటు వెనుకబడిన కులాలకు చెందిన వారూ ఆధిపత్య కుల శక్తుల చేత అవమానాలకు, వివక్షకు గురవుతున్నారు. వీరికి రిజర్వేషన్లు కూడా సంపూర్ణంగా, న్యాయంగా అమలు చేయడం లేదు. నిషేధం వున్నప్పటికీ, దళితులు, వెనుకబడిన కులాల వారికి వ్యతిరేకంగా దుర్మార్గపు చర్యలు, నేరాలు జరగడానికి కారణం ఏమిటి? కుల అణచివేతకు ఒక రూపకల్పన చేసి, దానిని సమర్థించి, భారతీయ సమాజంలోకి ప్రవేశపెట్టిన మనుస్మృతి కాదా?

**మనుధర్మ శాస్త్రం – హిందూత్వ ముఖ్యాంశాలు**

మనుస్మృతి, హిందూత్వ భావజాల ప్రధాన పార్యాంశాల్లో ఒకటి వర్ణాశ్రమ ధర్మం, రెండు స్త్రీ బానిసత్వం భారతీయ సమాజంలో ప్రధానమైన విధులు అని మనుధర్మశాస్త్రం నొక్కి చెప్పింది. వర్ణాశ్రమ ధర్మాన్ని అమలు చేసే విధానం, శూద్రుల జీవితం ఏ విధంగా ఉండాలో కూడా మనువు చెప్పాడు. 'శూద్రులు ఇతర మూడు వర్ణాల వారికి దాస్యం చేయాలని దేవుని ఆజ్ఞ. తక్కువ కులంలో పుట్టిన శూద్రుడు ఉన్నత వర్ణాల వారినెవరినైనా అవమానకరమైన మాటలతో గాయపరిస్తే, అతని నాలుకను కోసేయాలి. శూద్రుడు ఏ కులాన్నైనా లేక ఉన్నత కులాల పేరును అవమానపరిస్తే, అతని నాలుకపై వాతలు పెట్టాలి. శూద్రులకు పాచిపోయిన ఆహారాన్ని, చిరిగిన బట్టలను, పాత ప్లేట్లను వేతనంగా ఇవ్వాలి." ఇలా సమాజం లోని ఆధిపత్య శక్తులు తీవ్రమైన అణచివేత, హింసను అమలు చేయడం ద్వారా కుల వ్యవస్థను కొనసాగిస్తున్నారనే విషయాన్ని గమనించాలి.

మనుధర్మశాస్త్రం – వర్గ దృష్టి కోణం

ఈ సందర్భంలో, మనుధర్మ శాస్త్రంపై మార్క్సిస్టు దృష్టి కోణం ఏమిటి? మనుస్మృతి ప్రతిపాదిస్తున్న సాంప్రదాయ భావాలకు వ్యతిరేకంగా చేసే పోరాటాలు, ప్రచార యంత్రాంగం ఎలా ఉండాలి? అనే అంశాలను పరిశీలిద్దాం. భారతదేశంలో బానిస రైతులు, ఫ్యూడల్ ఆధిపత్యం ఉన్న కాలంలో, 2500 సంవత్సరాల క్రితం మనుశాస్త్రాన్ని రాశారు. ఆ కాలంలోనే వర్గ, కుల



అణచివేతలు ఉన్నాయి. మిలియన్ల సంఖ్యలో శ్రామిక ప్రజలు, కులం పేరుతో భయంకరమైన వర్గ, ఆర్థిక అణచివేతల కింద లొంగి ఉన్నారు. దీనిలో భాగంగానే స్త్రీలపై లైంగిక వేధింపులు చెలరేగాయి. కుల, వర్గ భేదాలు దేవుని అభీష్టం మేరకు సృష్టించినవనీ, కాబట్టి ప్రజలందరూ దేవుని అభీష్టాన్ని పాటించాలనీ, వాటిని ఉల్లంఘించిన వారిని శిక్షించాలనీ, ఆ శిక్షించే అధికారం రాజులకు ఇవ్వడమైందనీ మనుస్మృతి చెపుతుంది. సంఖ్యాపరంగా చిన్నదైనా, భూస్వాములే పాలకవర్గాలుగా ఉంటూ అణచివేత సాగించారు. నాడు రాజులు ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతినిధులుగా ఉన్నారు. దోపిడీ వర్గాల ప్రతినిధి అయిన మనువు, ఆ వర్గాన్ని రక్షించేందుకు మను శాస్త్రాన్ని రాశాడు. ఆ మను శాస్త్రాన్నే రాజుల పాలనకు అవసరమైన రాజ్యాంగంగా అంగీకరించి, కాలక్రమంలో అమల్లోకి తెచ్చారు. దాని కొనసాగింపు, దాని ప్రభావమే నేడు చోటుచేసుకుంటున్న కుల, లైంగిక అణచివేతలు. చరిత్రలో ఆ అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన వీరోచిత పోరాటాల ఫలితంగా అనేక మార్పులు జరిగాయి. మానవ జాతి చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే అని కార్ల్ మార్క్స్ చెప్పాడు. మానవజాతి చరిత్ర నిబంధనల విషయంలో భారతదేశానికి ఏ విధమైన మినహాయింపు లేదు. కానీ ఈ చారిత్రాత్మక సంఘటనలు ఆయా దేశాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను బట్టి ప్రతీ దేశంలోనూ జరిగాయి. భారతదేశంలో వర్ణ (కుల) వ్యవస్థ తన ప్రత్యేకతను కలిగి ఉంది. ఇక్కడ కుల వ్యవస్థను చాలా కాలం క్రితం సృష్టించారు. ఆ కుల, వర్గ అణచివేతలు ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్నాయి.

**లింగ వివక్షతకు ఆధారం**

మహిళల జీవితాలు మగవారిపై ఆధారపడి, వారికి బానిసలుగా ఎలా ఉండాలనే విషయాన్ని మనుస్మృతి నొక్కి చెప్పింది. "మహిళలు బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు పోషణలో ఉండాలి." "ఒక పురుషుడు, తన కూతురు యుక్త వయస్సులోకి రాక పోయినా కూడా, తన కులానికి చెందిన వ్యక్తికే అప్పగించాలి.'' ''ఆస్తి వారసత్వానికి సంబంధించి, పెద్ద వారికి రెండు భాగాలు, ఆ తరువాత వారికి ఒకటిన్నర భాగాలు, మిగిలిన కొడుకులకు ఒక్కొక్కరికి ఒక్కొక్క భాగం చొప్పున పొందుతారు. ఇదే సరైన విభజన. (మహిళలకు ఆస్తి హక్కు లేదు)." "అన్నదమ్ముల మధ్య ఇలాంటి విభజన జరిగిన తర్వాత, వారు తమ భాగాల్లో 1/4 వంతు భాగాన్ని వారి అక్కా చెల్లెళ్ళ వివాహాల కోసం ఇవ్వాలి." ఆ విధంగా మనుస్మృతిలో పేర్కొన్న వివిధ స్త్రీ బానిసత్వానికి సంబంధించిన అంశాలను గమనించవచ్చు. భారతదేశంలో మహిళల సమానత్వం కోసం జరిగిన పోరాటాలు, కుల, వర్గ వ్యతిరేక పోరాట చరిత్ర ఫలితంగా స్త్రీ బానిసత్వ రూపాలలో కొన్ని మార్పులు సంభవించి ఉంటాయి. అయినా నేటికీ స్త్రీ సమానత్వం ఒక కలగానే ఉండిపోయిందనే మాటను ఎవరూ కొట్టి పారెయ్యలేరు.

**భారతదేశ ప్రత్యేకత**

ఇక్కడ మనం భారతదేశ సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. అనేక అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో, పశ్చిమ దేశాల్లో ఫ్యూడల్ వ్యవస్థ పూర్తిగా నాశనమై, దాని నుండే పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భవించింది. భారతదేశం విషయంలో స్వాతంత్ర్య పోరాట కాలంలో ఉద్భవించిన బడా బూర్జువాలు, తరువాత బూర్జువా సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను రూపొందించడంలో కీలకమైన పాత్రను పోషించారు. తమ స్వలాభం కోసం ఫ్యూడల్ వ్యవస్థతో రాజీ పడ్డారు. భూసంస్కరణ చట్టాలను సరిగా అమలు చేయలేదు. భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్న అదనపు భూములను, భూమి లేని నిరుపేదలకు, చిన్నరైతులకు ఇవ్వలేదు. అందుకే దానికి ఫ్యూడల్ వ్యవస్థ సంబంధాలు, భావాలు పూర్తిగా నిర్మూలించబడలేదు. ఈ పరిస్థితిలో, ఫ్యూడల్ కాలంలోని మనుస్మృతి, దాని భావజాలం కొనసాగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో భారతదేశ బడా బూర్జువాల నాయకత్వంలో ఉన్న పాలక వర్గాలు, తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకొని, శ్రామిక ప్రజలను విభజించేందుకు ఎటువంటి సంకోచం లేకుండా కుల వ్యవస్థను, ప్రజల మనోభావాలను ఉపయోగించుకున్నారు. నేటికీ బూర్జువా పార్టీల పని విధానంలో కుల వ్యవస్థ, కుల మనోభావాల ఉనికి మనకు స్పష్టంగా కనిపిస్తుంది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కల్పన ఒక కలగానే మిగిలిపోవడం యాదృచ్ఛికం కాదు.

**సాంప్రదాయవాద సిద్ధాంతానికి వ్యతిరేకంగా...**

ఈ దృష్టి కోణంలో మనుధర్మ శాస్త్రం నొక్కి చెప్పిన విధంగా, మహిళలకు వ్యతిరేకంగా లైంగిక హింస, కుల అణచివేత అంతటా వ్యాపించి ఉన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఇది భారతీయ సమాజంలో బాగా బలపడి అంతటా వ్యాపించి ఉంది. సంఘ్ పరివార్, హిందూత్వ శక్తులు, ప్రజల్లో ఈ సాంప్రదాయ భావాలను బలోపేతం చేయడానికి చురుకుగా ప్రయత్నాలు సాగిస్తున్నాయి. పార్లమెంట్‌లో తగిన బలంతో అధికారంలో ఉన్న బిజెపి ఈ సాంప్రదాయ భావాలను బలోపేతం చేయడానికి అవసరమైన అవకాశాలను పెంచుకుంటుంది. వారు హిందూత్వ భావజాలంతో కూడిన నూతన విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టారు. ఇప్పటి వరకు ఉన్న భారతదేశ చరిత్రను తిరగ రాయాలనుకుంటున్నారు. బిజెపి ప్రభుత్వం, 12000 సంవత్సరాల భారత దేశ చరిత్రను తమకు అనుకూలంగా తిరగ రాయడానికి ఒక కమిటీని నియమించింది. పురావస్తు సంబంధమైన వనరులను వాస్తవాలను మార్చేందుకు ఉపయోగిస్తున్నారు. హిందూత్వ జాతి వాదాన్ని సమర్థించడానికి పురాణ కథలు రాస్తున్నారు. స్త్రీ బానిసత్వం వాస్తవ చరిత్రగా చిత్రీకరిస్తున్నారు.

**పరిష్కారం ఏమిటి?**

మనుస్మృతి వ్యతిరేక ప్రచారం, ఉద్యమాలతో కూడిన సామాజిక సంస్కరణ అవసరాన్ని మనం గుర్తించాలి. సామాజిక సంస్కరణ ఉద్యమంలో జ్యోతిబా ఫూలే, పెరియార్ ఇ.వి.రామస్వామి, బి.ఆర్.అంబేద్కర్, నారాయణ గురు లాంటి కృతనిశ్చయం గల వారు అపారమైన సేవలందించారు. ఈ పోరాటాల ఫలితంగా దళితులు, వెనుకబడిన కులాల ప్రజలు, మహిళలు అనేక హక్కులతో పాటు ప్రత్యేక సౌకర్యాలను సాధించుకున్నారు. అట్లా సాధించుకున్న కీలకమైన హక్కులలో రిజర్వేషన్లు ఒకటి. కానీ ఈ పోరాటాలు కుల, లింగ అణచివేతలను అంతం చేయలేదు. అందువలన ఈ రెండు అణచివేతల వ్యతిరేక పోరాటాలు కేవలం సామాజిక సంస్కరణ ఉద్యమంతో మాత్రమే ఆపకూడదు. అదే సమయంలో ఈ పోరాటాలను, ఫ్యూడల్ వ్యవస్థకు మరియు అంతర్లీనంగా సామాజిక అణచివేతలో ఉన్న సంబంధాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంతో పాటుగా ఫ్యూడల్ వ్యవస్థతో రాజీపడిన బడా బూర్జువా నాయకత్వంలోని భారత పాలక వర్గాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంతో కలపాలి. సామాజిక సంస్కరణ ఉద్యమాలు, వర్గ పోరాటాలు జమిలిగా కలిపి చేయాలి.

## పి సీతారత్న సాయిబాబుకు చిరు సత్కారం



**కోడూరు (ప్రజాపాలన) :** కోడూరు మండల ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే చుట్టుపక్కల ప్రజలకు నిరంతరం వైద్య సేవలు చేస్తున్న డాక్టర్లకు వైద్యశాల సిబ్బందికి అందుబాటులో ఉంటూ వారికి అనేక విధాలా సహకరిస్తూ హాస్పటల్ అభివృద్ధికి కృషి చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు పూతబోయిన సీతారత్నసాయి బాబును హాస్పిటల్ వైద్యులు వైద్య సిబ్బంది దుస్సాలువతో సత్కరించి, కొండపల్లి బొమ్మను బహుమతిగా అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజుల ఎం పి హెచ్ వో ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సు హాస్పిటల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## నరసరావుపేట నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు!

డా.చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట, ప్రజాపాలన :** క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవు లందరికీ నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ డా. చదలవాడ అరవింద బాబు శుభాకాంక్షలు తెలిపారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశమంతటి సహనం, అవధులులేని త్యాగం, శాంతియుత సహజీవనం, శత్రువుల పట్ల సైతం క్షమాగుణం.. ఇవన్నీ జీసస్ తన జీవితం ద్వారా మానవాళికి ఇచ్చిన మహోన్నత సందేశాలని డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. క్రీస్తు బోధనలు ఎప్పటికీ మనుషులందరినీ సన్మార్గంలో నడిపిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## దాతృత్వం చాటుకున్న కోడూరు విలేకరులు



**కోడూరు (ప్రజాపాలన) :** కాలు విరిగి పని చెయ్యలేక ఇబ్బంది పడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం అందించిన కోడూరు మండల పాత్రికేయులు. కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వేటపాలెం గ్రామంలో బత్తుల నాగరాజు అనే వ్యక్తి కి కాలు విరిగి పని చేసుకోలేక ఆర్థిక ఇబ్బంది పడుతున్నాడు అన్న సమాచారం తెలుసుకున్న కోడూరు మండల పాత్రికేయులు తోట శ్రీనివాస్, జొన్నా రవిశంకర్ ,కొండవీటి సురేష్.ఈ విషయంపై వెంటనే స్పందించి అతని ఆర్థిక పరిస్థితిని పరిశీలించి గురువారం సాయంత్రం 25 కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు నాగరాజుకి అందించడం జరిగింది.

## ఆమంచి తనయుల చేతుల మీదుగా పేదలకు నూతన వస్త్రాల బహుకరణ


*- తండ్రి అడుగుజాడల్లో తనయులు*



**చీరాల(ఒంగోలు) (ప్రజాపాలన) :** వేటపాలెం మండలం పుల్లరిపాలెం పంచాయితీ యానాదులకాలనీలో, క్రిస్టమస్ పండుగ సందర్భముగా, చీరాల నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కుమారులు సేతు వెంకయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడులు, కాలనీలోని వృద్ధ మహిళలకు, వితంతువులకు, నూతన వస్త్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆ చిన్నారులు మాట్లాడుతూ, చీరాల నియోజకవర్గంలోని పేదలకు సహాయాన్ని అందించటంలో, మా కుటుంబము ముందంజలో ఉంటుందని తెలియజేసారు. ఈకార్యక్రమములో మాజీ సర్పంచ్ మల్లవరపు సంజీవరావు, కొమరగిరి వెంకయ్య, ఇండ్ల కొండయ్య, కాకనాటి నాగేశ్వరావు పాల్గొన్నారు




# నేడు ఎమ్మెల్యే గోపిరెడ్డి చేతులు మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ




**నరసరావుపేట, ప్రజపాలన :** క్రిస్మస్, వైకుంఠ ఏకాదశి పర్వదినం రోజైన శుక్రవారం నుంచి ఉచితంగా ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నరసరావుపేట నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభిస్తారు. వైయస్సార్ పేదలందరికీ ఇళ్ల పథకం కింద స్థలాలు కేటాయించటం ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం ప్రారంభం. డిసెంబర్ 25వ తేదీన ప్రారంభమయ్యే పంపిణీ కార్యక్రమం జనవరి 7వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రతి పేద కుటుంబానికి గృహ వసతి కల్పించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే ఇంటి స్థలాలు ఇవ్వాలని సంకల్పంతో దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రతి మహిళకు ఇంటిపై సంపూర్ణ హక్కు కల్పించటం ప్రధాన లక్ష్యంగా భవిష్యత్తులో ఇంటిపై రుణాలు తీసుకునే అవకాశం కూడా ప్రభుత్వం కల్పించనుంది. ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు అడుగులు వేయాలనే సంకల్పంతో ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వం అందించనుంది. అర్హులైన లబ్ధిదారులకు గృహాలను ఒక్క రూపాయి రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందిస్తారు రు. 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగులలో నిర్మించిన ఇళ్లను కేటాయిస్తారు. 365 చదరపు అడుగులు ఇంటికి లబ్ధిదారుని వాటా 50 వేల రూపాయలకు నిర్ణయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం 25 వేల రూపాయలు రాయితీని ప్రకటించింది. 430 చదరపు గజాల లో నిర్మించిన గృహాలకు లబ్ధిదారుని వాటా లక్ష రూపాయలు కాగా రాష్ట్ర ప్రభుత్వం 50,000 రాయితీ ప్రకటించింది. జిల్లాలో 1023 గ్రామాలలో 1420 లే అవుట్లలో 2,55,189 మంది లబ్ధిదారులకు డిసెంబర్ 25 వ తేదిన ఇంటి పట్టాల పంపిణికి సిద్ధం చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి డి పట్టాల ప్రింటింగ్ ప్రక్రియ పూర్తయింది. టిడ్కో గృహాలకు సంబంధించి 25,608 మందికి డిసెంబర్ 25 న రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. నరసరావుపేట నియోజకవర్గ స్థాయిలోను నరసరావుపేట అర్బన్ నందు 124.28 ఎకరాలలో , లబ్ధిదారులు 8,619 ఇళ్ల స్థలాలు 7115 టిడ్కో 1504, నరసరావు పేట మండలంలో 100.15 ఎకరా ల్లో, 4458 లబ్ధిదారులకు రొంపిచెర్ల మండలంలో 3648 మంది లబ్ధిదారులకు 98.33 ఎకరాలలో మొత్తంగా నియోజకవర్గంలో 16,726మంది లబ్ధిదారులకు 322.76 ఎకరాలలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

# రూ.80 వేల కోట్ల ఆస్తిని ఇంటి రూపంలో రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నాం

శాసనసభ్యురాలు విడదల రజిని



**చిలకలూరిపేట. ప్రజాపాలన :** అక్కచెల్లెమ్మలు అసలైన సంక్రాంతిని ఈ నెల 25న చూడబోతున్నారని శాసనసభ్యురాలు విడదల రజిని తెలిపారు. గణపవరంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే విడదల రజిని ప్లాట్లను సందర్శించారు. వారి వారి ప్లాట్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు దగ్గరుండి చూయించారు. ప్లాట్లను చూసుకున్న మహిళల మోముల్లో సంతోషం వెల్లివిరిసింది. గణపవరం గ్రామంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులు 1222 ఉన్నారు. వారంతా లే అవుట్ వద్దకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విడదల రజిని మాట్లాడుతూ తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 24 వేల కోట్ల విలువైన భూములను పేద మహిళలకు ఈ నెల 25న పంచబోతోందని చెప్పారు. ఒక్కొక్కరికి రూ. 1.8 లక్షల వ్యయంతో 30 లక్షల మందికి ఇళ్ల నిర్మాణం జరగబోతోందన్నారు. ఒక్క ఇళ్ల స్థలాలు, వాటి అభివృద్ధి, ఇళ్ల నిర్మాణానికే తమ ప్రభుత్వం రూ. 80వేల కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు. ఒక్క సారి ఇళ్ల నిర్మాణం పూర్తికాగానే ఒక్కో ఇంటి విలువ కనీసం రూ. 10 లక్షలు పలుకుతుందని తెలిపారు. ఆ లెక్కన 30 లక్షల ఇళ్లకు 3లక్షల కోట్ల ఆస్తి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద మహిళలకు సమకూరినట్లేనని చెప్పారు. ఒక నాయకుడు తలుచుకుంటే ఎంతగా సంపదను సృష్టించవచ్చో తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతలతో చూపించారని వెల్లడించారు. మన దేశంలోనే దమ్మున్న నాయకుడు ఒక్క వైఎస్ జగన్ మాత్రమేనని చెప్పారు. సంపదను సృష్టించడంలో తమ ప్రభుత్వం చరిత్రను సృష్టించిందన్నారు.

### వైఎస్ఆర్ మరియు వంగవీటి మోహనరంగా విగ్రహానికి నివాళి.

మహిళలు ర్యాలీగా ప్లాట్ల వద్దకు వెళ్లారు. అక్కడే వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళలు వారి ప్లాట్ల వద్దకు వెళ్లి ఆనందోత్సాహాలు వ్యక్తంచేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే గారు మహిళలతోపాటుగా గణపవరం సెంటర్‌లోని వైఎస్ విగ్రహం వరకు వచ్చారు. వైఎస్సార్ విగ్రహానికి, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లెద్దు చిన్న,నాదెండ్ల మండల అధ్యక్షుడు గొంటు శ్రీనివాసరెడ్డి,గణపవరం గ్రామపార్టీ అధ్యక్షుడు కాట్రూ రమేష్, కెల్లంపల్లి సుందరరావు, వలెటి వెంకటేశ్వరరరావు,వొప్పుడి రామారావు,గాలి బుచ్చయ్య, ఆముదాలపల్లి ఆంజనేయులు, తులం సుధాకర్,అనిశెట్టి కోటేశ్వరరావు, పిల్లి సాగర్,కాటా వెంకటేశ్వర్లు,షేక్ ఆదం వలి మరియు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల బదిలీల్లో వెబ్ కౌన్సిలింగ్ విధానం రద్దు చేయాలి




**వేటపాలెం ప్రజాపాలన :** ఉపాధ్యాయుల బదిలీల్లో వెబ్ కౌన్సిలింగ్ విధానం రద్దు చేసి మాన్యువల్ కౌన్సిలింగ్ విధానాన్ని అమలు చేయాలని గురువారం ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య అధ్వర్యంలో వేటపాలెం మండల విద్యా వనరుల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం తమ డిమాండ్ల పత్రాన్ని మండల విద్యాధికారి కె ఉమామహేశ్వర రావు కు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సెక్రెటరి జి సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీలు ఉపాధ్యాయులకు ప్రయోజనకారిగా లేవన్నారు. ఎస్జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ కు అనుమతించకపోవడం, బ్లాక్ చేసిన పోస్టులను తెరువక పోవడం వంటి సమస్యలను ప్రభుత్వం పట్టిం చుకోవడం లేదన్నారు. చైల్డ్ ఇన్ఫో లో మాధ్యమం మార్పు వలన కోల్పో యిన పోస్టులను పురుద్ధరించాలన్నా రు. వాస్తవానికి వెబ్ కౌన్సెలింగ్ షె డ్యూల్‌లో పేర్కొన్న తేదీలు అయిపోయినప్పటికీ మరళ 12 రోజులు పొడిగించారన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం పలు రూపాల్లో ఫ్యాప్టో నిరసనలు తెలిపిందన్నారు. ఇప్పటికైనా తమ డిమాండ్లను పరిగణలోకి తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు, ఎస్ సాంబశివ రావు, కె రామారావు, బి సాంబశివ రావు, బి శ్రీనివాసరావు, ఎ కె రామయ్య, పి చంద్ర రెడ్డి, బి మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో రూపాయి సంపాదించలేదు: వెలగపూడి



**విశాఖ, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి తనపై చేసిన భూ ఆక్రమణ ఆరోపణలను నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని తెదేపా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఆ ఆరోపణలు నిరూపించలేకపోతే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసేందుకు సిద్ధమా? అని విజయసాయికి ఆయన సవాల్ విసిరారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో రామకృష్ణబాబు మాట్లాడారు. వైకాపా నేతలు కబ్జా చేయడానికే ఆక్రమణలు తొలగిస్తున్నారని.. వాటిని తన బినామీలుగా చూపిస్తూ అభాండాలు వేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై నగరంలోని ఈస్ట్‌పాయింట్ కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రమాణం చేస్తానన్నారు. ఆ ఆలయంలో ప్రమాణానికి విజయసాయిరెడ్డి ఎప్పుడు వస్తారో చెబితే తానూ వస్తానని చెప్పారు. "నువ్వు రా.. ఇద్దరం ప్రమాణం చేద్దాం" అని రామకృష్ణబాబు సవాల్ విసిరారు. రాజకీయాల్లోకి వచ్చి ఆస్తులు పోగొట్టుకున్నానే తప్ప రూపాయి కూడా సంపాదించలేదన్నారు. వైకాపా నేతలు పేదల పొట్టకొడుతూ ఆ బురద తమపై జల్లుతున్నారని ఆరోపించారు. నిజాయతీగా విచారణ జరిపిస్తే తన సచ్ఛీలత నిరూపించుకుంటానని వెలగపూడి రామకృష్ణబాబు చెప్పారు.

# ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి - ఫ్యాప్టో

**- బదిలీల విషయంలో ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం సరికాదు**





చీరాల(ఒంగోలు) : ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ, కేవలం బదిలీల విషయంలో ఉపాధ్యాయులను ఈ స్థాయిలో వ్యవహరించడం సరికాదని, ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్నిటినీ చూపించాలని ఎయిడెడ్ స్కూల్స్ కన్వీనర్, యు.టి.ఎఫ్. సీనియర్ నాయకులు, ఫ్యాప్టో ప్రతినిధి కె. వీరాంజనేయులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు,డిసెంబర్ 24న మండల కేంద్రాలల్లో ఎమ్మార్సీ కార్యాలయాల ఎదుట,మాన్యువల్ కౌన్సిలింగ్ బ్లాక్ పోస్టు చూపాలి, మీడియం మార్పు (చైల్డ్ ఇన్ఫోలో),సంఘనాయకులపై కేసులు ఎత్తివెయ్యాలి, తదితర ప్రధాన డిమాండ్ల సాధనకోసం నిరసన ధర్నా నిర్వహించారు. లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని, ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి అని ఫ్యాప్టో నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కె. వీరాంజనేయులు, వి.ప్రభాకరరావు, షేక్ జాని బాషా, కుర్రా రామారావు, బాలచంద్రరావు, మల్లెల రవి, కుర్రా శ్రీనివాసరావు, ఎస్వీ సుబ్బారెడ్డి, రాజేష్, మీర్జా, ప్రభాకర్, పి ఎస్వీ ప్రసాద్, రమేష్, భిక్షాలు బాబు, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న పైలట్లు.. కేవలం 5% వేతన పునరుద్ధరణ?




**న్యూఢిల్లీ, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** ఎయిర్ ఇండియా (ఏఐ) యాజమాన్యం తీరుపై పైలట్లు భగ్గుమన్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో 55 శాతం కోత విధించి తాజాగా అందులో ఐదు శాతమే తగ్గించడాన్ని తిరస్కరించారు. ఇది పూర్తిగా తమను అవమాన పర్చడమేనని పేర్కొన్నారు. దేశీయంగా విమానయాన సర్వీసులను పునరుద్ధరించినందున వేతనాల్లో విధించిన కోతలు గణనీయ స్థాయిలో తగ్గించకపోతే ఇండస్ట్రియల్ యాక్షన్‌కు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం పునరుద్ధరించిన ఐదు శాతం వేతనాల మొత్తం.. కరోనా నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'పీఎంకేర్స్'కు గానీ, కొత్తగా నిర్మించ తలపెట్టిన పార్లమెంట్ భవనానికి గానీ బదిలీ చేయాలని ఎయిర్ ఇండియాను కోరారు. 'ఏప్రిల్‌లో ఎయిర్ ఇండియా యాజమాన్యం ఏకపక్షంగా 58 శాతం పైలట్ల వేతనాలను తగ్గించారు. కానీ మేం చాలా సహనంతో సజావుగా విమాన సర్వీసుల రాకపోకలకు వెసులుబాటు కలిగించాం' అని ఎయిర్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బన్సాల్‌కు ఇండియన్ కమర్షియల్ పైలట్స్ అసోసియేషన్ (ఐసీపీఏ) గురువారం లేఖ రాసింది. ఫ్రంట్‌లైన్ వర్కర్లను అవమానించారని పేర్కొంది. వందే భారత్ మిషన్ విమాన సర్వీసులు నడిపిన 171 మంది పైలట్లకు కరోనా వచ్చిందని, కరోనా నెగెటివ్ వచ్చిన తర్వాత వారు విధుల నిర్వహణకు సిద్ధం అయ్యారు. ఎయిర్ ట్రాఫిక్ పునరుద్ధరించిన తర్వాత వేతనాల్లో విధించిన కోతను గణనీయంగా తగ్గిస్తామని ఎయిర్ ఇండియా యాజమాన్యం హామీ ఇచ్చిందని ఆ లేఖలో గుర్తు చేశారు. కానీ కేవలం ఐదు శాతం మాత్రమే వేతన కోత తగ్గించడం తమ హక్కులను అవమానించడమేనని పైలట్ల అసోసియేషన్ స్పష్టం చేసింది. పార్లమెంట్ సభ్యులకు కేవలం స్థూల వేతన, అలవెన్సులపై 30 శాతం మాత్రమే తగ్గించారని గుర్తు చేసింది. గణనీయ స్థాయిలో సమయానుకూలంగా వేతనాల్లో కోత తగ్గించకపోతే తాము న్యాయం కోసం పోరాడుతామని పైలట్ల సంఘం పేర్కొంది.

# అక్కడ ఒక గుడ్డు ధర రూ. 30!



**న్యూఢిల్లీ, డిసెంబర్ 24 (ప్రజాపాలన) :** భారత్ దాయాది దేశం పాకిస్తాన్‌లో ధరలు ఆకాశాన్ని తాకాయి. కూరగాయలు కొనాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. కోడి గుడ్లు అయితే ఇక కొనలేం. ఒక్కో గుడ్డు ధర రూ.30 పలుకుతోంది. అదేసమయంలో కేజీ అల్లం ధర ఏకంగా రూ.1,000 ఉంది. ఇంకా క్వింటా గోధుమ ధర రూ.6,000కు చేరింది. అలాగే కేజీ చెక్కెర ధర రూ.100 దాటేసింది. అంతేకాకుండా పాకిస్తాన్ ప్రజలకు ఎల్‌పీజీ సిలిండర్లు కూడా కరువయ్యాయి. దీంతో అక్కడి పరిస్థితులు ఏమాత్రం బాగోలేవని చెప్పుకోవచ్చు. పాకిస్తాన్ మీడియా ప్రకారం.. దేశంలో చాలా చోట్ల చలికాలం కారణంగా గుడ్లకు డిమాండ్ బాగా పెరిగింది. దీంతో డజన్ గుడ్ల ధర రూ.350కు చేరింది. దీంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాకిస్తాన్ జనాభాలో దాదాపు 25 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువునే ఉన్నారు.

ధరల పెరుగుదల నేపథ్యంలో పట్టణాల్లో జీవించే వారు డజను గుడ్లకు బదులుగా 2 నుంచి 6 గుడ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం ధరలు నియంత్రించడానికి సమావేశాలు నిర్వహిస్తోంది. అయితే వీటి వల్ల ఎలాంటి ప్రయోజనం కలగడం లేదు.

# ప్రైవేటు బస్సు బోల్తా?.ప్రయాణికులకు గాయాలు

**విజయవాడ డిసెంబర్ 24, (ప్రజాపాలన) :** కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామం హైవే మీద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. బుధవారం రాత్రి విశాఖపట్నం నుంచి హైదరాబాద్ కు సిరి ట్రావెల్స్ బస్సు.బయల్దేరింది. గురువారం తెల్లవారుజామున 4.00 గంటల సమయంలో బస్సు నడుపుతున్న డ్రైవర్ నిద్ర వస్తుందనడంతో మరొక డ్రైవర్ మరాడు. రెండో డ్రైవర్ డ్రైవింగ్ తీసుకున్న ఇరవై నిమిషాలకే ఆతడి నిద్ర మత్తు వల్ల బస్సు బోల్తా పడింది.

ఘటన సమయంలో బస్సులో మొత్తం 45 మంది ప్రయాణికులు ఉన్నారు. 38 ప్రయాణికులకు స్వల్ప గాయాలు అవటంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆరుగురిని మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. బస్సు హైవే పక్కన పంట కాలువ నీటిలో పడటంతో బస్సు లోకి మీరు వచ్చి అందరూ తడిసి పోయారు. ట్రావెల్స్ యజమానులు ప్రయాణికుల వివరాలను సరిగా తీసుకోకపోవడం తో వారిని ఎక్కడ పంపించాలి అన్నది పోలీసులకు కష్టతరమైనది.

# నిమ్మలరామానాయుడుపై వేటు..?



**ఏలూరు, డిసెంబర్ 24, (ప్రజా పాలన) :** ఇటీవల ముగిసిన అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో హద్దు మీరారని భావిస్తున్న టీడీపీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునే దిశగా అసెంబ్లీ స్పీకర్ చర్యలు ప్రారంబించినట్టు తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా టీడీపీకి గట్టి వాయిస్ వినిపిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ఎమ్మెల్యే, సభలో టీడీపీ ఉప నేత నిమ్మల రామానాయుడులపై చర్యలు తీసుకునే దిశగా పటిష్టమైన అడుగులు వేస్తున్నారని సమాచారం. ఇక, వీరిపై చర్యలు తీసుకునే అంశాన్ని సభా హక్కుల చైర్మన్, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలోని కమిటీకి అప్పగించారు. టీడీపీ నేతలపై చర్యలు తీసుకునే విషయంలో సీఎం జగన్ నిర్ణయమే అంతిమమని వైసీపీ వర్గాలు ఎప్పటి నుంచో చెబుతున్నాయి. ఎందుకంటే.. సభలో ఆయన ఏం చెబితే అదే జరుగుతోంది. ఎవరికి మైక్ ఇవ్వాలన్నా.. తీసేయాలన్నా.. జగన్ కనుసైగతో శాసిస్తున్నారని.. టీడీపీ కూడా ఆరోపిస్తోంది. సభా వ్యవహారాలను గమనిస్తున్న వారికి ఇది నిజమేనని అనిపిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల జరిగిన సభలో సామాజిక పింఛన్ల విషయంలో ప్రభుత్వంపై నిమ్మల రామానాయు డు తీవ్ర స్థాయిలో దూకుడు ప్రదర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు 45 ఏళ్లు నిండిన వారికి ఇస్తానని చెప్పిన ఫించన్లకు ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికీ మధ్య వ్యత్యాసం ఉందని ఆయన సభలో విరుచుకుపడ్డారు. సీఎం జగన్ ఆయా వర్గాలకు అన్యాయం చేస్తున్నారని నిమ్మల రామానా యుడు విమర్శలు గుప్పించారు. ఆ సమయంలో సభలోనే ఉన్న జగన్.. నిమ్మల వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని సభలోకి కూడా రానివ్వొద్దని స్పీకర్‌కు అప్పటికప్పుడే సూచించారు. దీంతో వెంటనే నిమ్మల రామా నాయుడును సస్పెండ్ చేయడం.. ఆ వెంటనే ఇతర సభ్యులు ఆందోళనకు దిగడం.. వారిని కూడా సస్పెండ్ చేయడం తెలిసిందే. ఇప్పు డు.. ఏకంగా ఈ ఇద్దరు నేతలు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నల పై చర్యలకు సభా హక్కుల కమిటీ భేటీ అయింది. ఈ క్రమంలో నిమ్మలకు నోటీసులు జారీ చేయాలని కమిటీ నిర్ణయించింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ సభ్యురాలు రోజాపై ఏడాది పాటు ఎలా అయితే.. అప్పటి స్పీకర్ చర్యలు తీసుకున్నారో.. ఇప్పుడు అదే తరహాలో బదులు తీర్చుకునేందుకు వైసీపీ అధినేత సిద్ధంగా ఉన్నారనే టాక్ వినిపిస్తోంది. ఇదే జరిగితే.. వచ్చే ఏడాది పాటు పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుపై వేటు పడడం ఖాయంగా కనిపిస్తోంది. అసెంబ్లీలోనూ, బయటా జగన్ ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా అచ్చెన్నాయుడు, రామానాయుడు కంట్లో నలుసుల్లా మారారు. వీరిద్దరు బలమైన విమర్శలతో జగన్‌ను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న టీడీపీ ఎమ్మెల్యేల్లో చంద్రబాబును వదిలేస్తే అచ్చెన్నాయుడు, రామానాయుడే ఎక్కువగా వాయిస్ వినిపిస్తున్నారు. వీరిలో అచ్చెన్న ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా ఉండడంతో పాటు ఆయన్ను ఈఎస్ఐ స్కాంలో ఇప్పటికే అరెస్టు చేశారు. మళ్లీ ఆయన్ను సస్పెండ్ చేయడం కంటే రామానాయుడును సస్పెండ్ చేస్తే టీడీపీ నుంచి అసెంబ్లీలో మాట్లాడే వాళ్లే ఉండరు. అప్పుడు ప్రభుత్వానికి కౌంటర్లే ఉండవన్నదే వైసీపీ ప్లాన్. అయితే ప్రజాస్వామ్యంలో ఇలాంటివి ఎంత వరకు సమంజసం అన్న ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి.

# నిరుపయోగంగా అమరావతి భవనాలు

**విజయవాడ, డిసెంబర్ 24, (ప్రజా పాలన) :** రాజధానిలో సుమారు రూ.2800 కోట్లు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఉన్నతాధికారుల నివాసాలు, ఎన్‌జిఓలు, నాలుగో తరగతి ఉద్యోగులు ఇలా వేర్వేరు తరగతుల వారీగా నిర్మాణాలు చేపట్టారు. విస్తీర్ణాలనూ వేర్వేరుగా వర్గీకరించారు. వీటిల్లో చాలావరకూ నిర్మాణాలు పూర్తయ్యాయి. అందులోకివెళ్లిఉండటమే తరువాయి అని అప్పటి ప్రభుత్వం ప్రకటించినా వాటిని కేటాయించకుండా నిలిపేసింది. ప్రభుత్వం మారడంతో వాటిని ఏమి చేయాలనే నిర్ణయాన్ని ఈ ప్రభుత్వం తీసుకోలేదు. గుత్తేదారు కంపెనీలన్నీ వెళ్లిపోయాయి. రాజధానిలో సుమారు రూ.15,000 కోట్ల విలువైన పనులు మొదలుపెట్టారు. గుత్తేదారు కంపెనీలు వేలమంది కార్మికులను వేర్వేరు రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి ఇక్కడ పనులు చేయించాయి. పనులు నిలిపేయాలని 2019 జూన్‌లో ప్రభుత్వం ఆదేశించడంతో ఆయా కంపెనీలన్నీ కార్మికులను పంపించేశాయి. యంత్రాలను వేరే ప్రాజెక్టులకు తరలించాయి. పనులు చేసేందుకు తీసుకొచ్చిన విలువైన సామాగ్రి, అత్యాధునిక పైపులు, వైర్లు, ఇనుము ఇతర సామాగ్రి మొత్తం పాడైపోతోంది. ఇక్కడ ఉపయోగించడమూ లేదు. వేరేచోట ఉపయోగపెట్టుకోవడమూ లేదు. ఫలితంగా అవన్నీ దేనికీ పనికిరాని విధంగా తయారయ్యాయి. ఎన్‌జిఓల కోసం నిర్మించిన ఇళ్లయితే పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయి. రవాణా సదుపాయమూ బాగానే ఉంది. అయినా వాటిని కేటాయించలేదు. సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయం కొత్తగా నిర్మాణం చేపట్టారు. అది కూడా మధ్యలోనే నిలిచిపోయింది. సెక్రటేరియట్ టవర్ల కోసం వేసిన బేస్‌మెంట్ పూర్తిగా మునిగింది. వర్షాలకు నీరుకారి మట్టితో పూడుకుపోయింది. హైకోర్టుకు సమీపంలో నిర్మించిన సిబ్బంది నివాసాల్లోకి వర్షపునీరు చేరింది. ఇవన్నీ సెక్రటేరియట్‌కు కూతవేటు దూరంలో ఉన్నాయి. వాటి నుండి సెక్రటేరియట్‌కు దారివేస్తే ఎటువైపు నుండయినా ఐదు నిముషాల్లో సెక్రటేరియట్‌కు చేరుకోవచ్చు. ప్రభుత్వ సొమ్ముతో నిర్మించినప్పటికీ వాటిని వినియోగించుకోకుండా ఇప్పటికీ లక్షలాది రూపాయల అద్దె భవనాల్లోనే హెచ్‌ఓడి కార్యాలయాలు కొనసాగిస్తున్నారు. మున్సిపల్‌శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ 2019 సెప్టెంబరులో రాజధాని పరిధిలో నిర్మించిన నిర్మాణాలు, ప్రారంభమైన పనులనూ పరిశీలించారు. చాలావరకూ వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన వాటిని ప్రభుత్వ భవనాల కోసం వాడుకుంటామని తెలిపారు. 25 శాతం కంటే తక్కువ పూర్తయిన భవనాల టెండర్లను రద్దు చేస్తామని, పూర్తయిన వాటిని వినియోగించుకోవడంతోపాటు, అవసరమైతే ప్రభుత్వ కార్యాలయాలకూ కేటాయిస్తామని తెలిపారు. ఆచరణలో అదేమీ జరగలేదు. అదే నెల 26వ తేదీన సిఆర్‌డిఎ కార్యాలయంలో జరిగిన రివ్యూ అనంతరం మీడియాతో బత్స సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబులాగా నిరుపయోగ ఖర్చులు చేయబోమని, ఉన్న నిర్మాణాలన్నీ వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. త్వరలోనే ఖర్చు ఎంతవుతుందో కూడా చెబుతామని పేర్కొన్నారు. ప్రస్తుతం పూర్తిగా సిద్ధమైన భవనాల చుట్టుపక్కల మురుగునీరు చేరి కనీస వినియోగానికీ ఉపయోగం లేకుండా పోయింది. దాదాపు పూర్తయిన నిర్మాణాల్లో ఉద్యోగుల నివాసాలూ ఉన్నాయి. వారికి కేటాయించినవి అప్పగించడమో, రద్దు చేయడమో చేస్తే ఏదైనా సమస్య వస్తుందనుకుందేమో అలా చేయకుండా వదిలేసింది. ఫలితంగా నిరుపయోగంగా మారాయి. అవే కాదు రోడ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన పైపులైన్లలోకి మట్టి చేరింది. రోడ్డువైపునా డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్, ఇతర కేబుల్స్ నడిపించేందుకు వీలుగా డక్ట్ (భూగర్భ దారి) నిర్మించారు. ఇవన్నీ కూడా మట్టితో నిండిపోయాయి. మరలా బాగుచేయాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుంది. కోట్ల రూపాయల ఖర్చు అయినప్పటికీ భవనాలు ఉపయోగం లేని విధంగా తయారయ్యాయి.



# సూపర్ స్పెషాలిటీ సేవలకు మోక్షం ఎప్పుడు



**కడప, డిసెంబర్ 24, (ప్రజాపాలన) :** కడప జిల్లాలోని రిమ్స్ మెడికల్ కళాశాలలో సూపర్ స్పెషాలిటీ సేవలకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. రాయలసీమ సరిహద్దు జిల్లాలైన కర్నూలు, అనంతపురం, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరుకు చెందిన రోగులు పెద్ద ఎత్తున రిమ్స్‌లో వైద్యసేవలు పొందుతున్న విషయం తెలిసిందే. రాయలసీమకు నడిబొడ్డున ఉన్న కడప జిల్లాలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాల్సిన అవసరం ఉందనే డిమాండ్ పెద్దఎత్తున వినిపిస్తోంది. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి 2019 డిసెంబర్ 23న రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు అందించడానికి రూ.272.81 కోట్ల వ్యయంతో వైఎస్ఆర్ కేన్సర్ కేర్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెల్త్ కేర్ హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు మూడు బ్లాక్‌ల నిర్మాణ పనులకు సంబంధించి డిపిఆర్ సర్వే, జ్యుడీషియల్ ప్రివ్యూ, టెండర్ల దశలను దాటలేదు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి, చేసిన శంకుస్థాపనలకు ఏడాదిగా ఎటువంటి పురోగతి లేదు. మూడు బ్లాక్‌ల భవన నిర్మాణాలు పూర్తి చేసుకుని, సుమారు 200 మంది స్టాఫ్ రిక్రూట్‌మెంట్ దశలను దాటుకుని పూర్తి స్థాయిలో సూపర్ స్పెషాలిటీ సేవలు ఎప్పుడు మొదలవుతాయో? తెలియడం లేదు. నత్తనడకన సాగుతున్న సూపర్ స్పెషాలిటీ సేవల పురోగతిని పరిశీలిస్తే... 2019 డిసెంబర్ 19న వంద పడకల సామర్థ్యం కలిగిన రూ.107 కోట్ల వ్యయంతో డాక్టర్ వైఎస్ఆర్ క్యాన్సర్ కేర్ సెంటర్ మంజూరైంది. దీనికి ఈ ఏడాది అక్టోబర్ నెలల్లో టెండర్లు పిలిచారు. నవంబర్ 18న జ్యుడీషియల్ ప్రివ్యూ, టెండర్ల కమిటీ పరిశీలనకు పరిమితమైంది. ఇదే తరహాలో 2019 డిసెంబర్ 21న 90 పడకల సామర్థ్యంతో రూ.40.81 కోట్ల వ్యయంతో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కేర్ హాస్పిటల్ మంజూరైంది. 2019 డిసెంబర్ 22న 504 పడకలు కలిగిన రూ.125 కోట్ల వ్యయంతో కూడిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులకు అనుమతులు మంజూరు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏడాది గడువు పూర్తవుతున్నప్పటికీ డిపిఆర్, టెండర్లు, జ్యుడీషియల్ ప్రివ్యూ, టెక్నికల్ కమిటీ వంటి దశలను అధిగమించడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. దీనికి కారణాలేమిటని పరిశీలిస్తే ఈ ఏడాది మార్చి నుంచి రాష్ట్రంలో కరోనా వైరస్ విజృంభించడం, డ్రాయింగ్ పనులు అప్రూవల్, డిపిఆర్, డిజైన్ల ఎస్టిమేట్లు, జ్యుడీషియల్ ప్రివ్యూ, టెక్నికల్ కమిటీ వంటి దశలను దాటడంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. ఈలెక్కన మరో రెండేళ్లు గడిచినా సూపర్‌స్పె షాలిటీ సేవలు, ఇతర ఆధునిక సేవలు అందు బాటులోకి వచ్చే అవకాశం లేనట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి సూపర్ స్పెషాలిటీ సేవలను అందించడంపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




# ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పిన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట. ప్రజపాలన:ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, క్రీస్తుమార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని అన్నారు. ఎమ్మెల్యే గోపి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి నరసరావుపేట నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రజలు ఏసుక్రీస్తును ఆరాధిస్తున్నారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి క్రీస్తు బాటలో పయనిస్తూ రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్ తండ్రి బాటలో పయనిస్తూ రాష్ట్ర అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ నెల 25 న క్రిస్మస్ పండుగ రోజున ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేదలకు ఇళ్ళ స్థలాలు పంపిణీ చేస్తున్నారని అన్నారు. వచ్చే సంవత్సరం అందరికీ కి మంచి జరగాలని యేసు క్రీస్తు ని ప్రార్థిస్తున్నాము అన్నారు.

# రైతులకు టమాట కష్టాలు



**కర్నూలు, డిసెంబర్ 24, (ప్రజాపాలన) :** ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సరైన మద్దతు ధర రాలేదు కదా.. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా దక్కలేదు. మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పిన అధికారులూ ఏం చేయలేకపోయారు. దీంతో చేసేదేమీ లేక నెలల పాటు శ్రమించి పండించిన పంటను రైతులు నేలపాలు చేశారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలో ఇదీ రైతన్న దుస్థితి. కర్నూలు జిల్లా పత్తికొండలోని వ్యవసాయ మార్కెట్‌లో టమాటా ధరలు బుధవారం అత్యల్ప స్థాయికి పడిపోయాయి. గత వారం రోజులుగా కిలో టమాటా ధర రూపాయి లేదా అంతకంటే తక్కువగానే పలుకుతోంది. టమాటా ధర అంత తక్కువ స్థాయికి పడిపోవడంతో అక్కడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా మార్కెటింగ్ శాఖ, ప్రాంతీయ స్థాయి అధికారులు పత్తికొండ మార్కెట్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ధరలపై స్థానిక వ్యాపారులు, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు నష్టపోకుండా సరైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెళ్లిపోయారు. అధికారులు మార్కెట్‌ను పరిశీలించి 24 గంటలు గడవక ముందే టమాటా ధర మరింతగా పడిపోయింది. దీంతో కష్టానికి ప్రతిఫలం దక్కకపోవడంతో ఆవేదనకు గురైన రైతులు.. తాము తీసుకొచ్చిన టమాటాలను మార్కెట్ యార్డు ఆవరణలోనే కింద పారబోసి నిరసన వ్యక్తం చేశారు. తాము తీవ్ర నష్టాలు చవిచూసున్నప్పటికీ అధికారులకు పట్టదా అని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# దివీస్ చుట్టూ రాజకీయం




**రాజమండ్రి, డిసెంబర్ 24, (ప్రజాపాలన) :** దివిస్ ఫ్యాక్టరీ చుట్టూ రాజకీయం వేడెక్కుతోంది? అధికారంలో ఉండగా దివిస్ కి అనుమతులు ఇచ్చిన తెలుగుదేశం, ఇప్పుడు దివిస్ డ్రగ్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తోంది ..ప్రతిపక్షంలో ఉండగా దివిస్ కి వ్యతిరేకంగా ప్రకటన చేసిన వైసిపి ఇప్పుడు అనుమతులు ఇచ్చింది. బీజేపీ తో కలసి దివిస్ పై పోరాటంలో కి దిగాలని జనసేన భావిస్తోంది? దివిస్ ఫ్యాక్టరీకి ఏపీ సర్కార్.. మరో 200ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తూ అనుమతులు ఇవ్వడం రాజకీయ దుమారం చేస్తోంది . అప్పట్లో ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా మాట్లాడిన జగన్.. ఇప్పుడు సీఎం అయ్యాక అదే ఫ్యాక్టరీ ఏర్పాటుకు అదనంగా ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడంపై స్థానిక రైతులు మండిపడుతున్నారు. ఈ ప్రాంతంలో టీడీపీ, వైసీపీల మీదున్న వ్యతిరేకతను క్యాష్ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది జనసేన. బీజేపీతో కలిసి ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని స్కెచ్ వేస్తోంది. మరోవైపు దివిస్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతులు,, మత్స్యకారులు, గ్రామస్తులు సృష్టించిన విధ్వంసంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే 166 మంది గ్రామస్తులపై కేసులు నమోదు చేశారు. దీంతో పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించాయి వామపక్షాలు. టీడీపీ అధినేతకు దివి మురళికి మంచి అనుబంధం ఉన్నా టీడీపీ సైతం దివిస్ పై పోరాటానికి సై అంటుంది. రాజకీయ పార్టీలు ఈ ఉద్యమాన్ని.. తమ చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. జనసేన, బీజేపీ, వామపక్ష పార్టీలతో పాటు స్థానిక ప్రజా సంఘాలు పైచేయి సాధించాలని చూస్తున్నాయి.

# అమరావతి అందరికి అక్షయ పాత్రేనా..

**విజయవాడ, డిసెంబర్ 24, (ప్రజా పాలన) :** అమరావతి కామధేనువులా కనిపిస్తోందిపుడు. తరగని ఓట్లను రాల్చే అక్షయపాత్రలాగానూ అగుపిస్తోంది. ఇంతకీ అమరావతి మీద ఒక్కసారిగా ఎందుకు అటెక్షన్ పెరిగింది అంటే దానికి చాలానే కారణాలు ఉన్నాయి. ఏపీలో చెప్పుకోవడానికి మరే పెద్ద సమస్య లేకపోవడం అసలు కారణం. ఇక అమరావతి సమస్య అలా సాగదీసేలా కనిపిస్తూండడం ఇంకో కారణం. అమరావతి చుట్టూ కొన్ని సామాజిక వర్గాలు, మరికొన్ని జిల్లాలూ అల్లుకుని ఉండడం మరో కారణం. సింపుల్ గా చెప్పాలంటే ఒక్క వైసీపీ తప్ప తక్కిన రాజకీయ పార్టీలన్నీ అమరావతిని పట్టుకుని రాజకీయ జూదమే ఆడుతున్నాయి. నిజానికి అమరావతి, మూడు రాజధానుల సమస్యలనే తీసుకుంటే ఒక వైపు చంద్రబాబు ఉంటారు, మరో వైపు జగన్ ఉంటారు. అటు టీడీపీ, ఇటు వైసీపీ కూడా ప్రధాన రాజకీయ పార్టీలుగా ఏపీలో ఉన్నాయి. ఏకైక రాజధానిగా అమరావతి కొనసాగితే చుట్టుపక్కల జిల్లాల్లో కచ్చితంగా పొలిటికల్ మైలేజ్ వచ్చేది టీడీపీకే. మూడు రాజధానుల వల్ల జగన్ కి గరిష్ట లాభం ఉంది. అమరావతి చుట్టూ ఉన్న నాలుగైదు జిల్లాలను మినహాయించినా తొమ్మిది జిల్లాల మీద వైసీపీ కన్నేసి మరీ మూడు రాజధానులు పేరిట ట్రంప్ కార్డుని వాడుతోంది. ఇక బీజేపీ విషయానికి వస్తే జనం నమ్మేలా సీన్ ఏమీ కనిపించడంలేదు. ప్రస్తుత బీజేపీ ప్రెసిడెంట్ సోము వీర్రాజే అమరా వతి రాజధాని



విషయంలో ఎన్ని వంకర్లు పోవాలో అన్నీ పోయారు. చివరికి ఇపుడు ఆయన అమరా వతే మన రాజధాని అంటున్నారు. ఏపీలో బీజేపీ రాజకీయ భూమిక చూసినా, కేంద్రం దాగుడుమూతలు చూసినా, ఇక విభజన హామీల గురించి మాట్లాడుకున్నా కూడా కమలనాథుల మాటలను అమరా వతి కోరుతున్న వారు పెద్దగా పట్టించుకోరు. అందువల్ల ఓట్లు రాల్చుకుందామని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఏవైతే ఉన్నాయో అవి పెద్దగా వర్కౌట్ కావు అన్న మాట ఉంది. ఇక జనసేనాని పవన్ కళ్యాణ్ కూడా ఏడాదిగా సాగిన అమరావతి రాజధాని పరిరక్షణ ఉద్యమం గురించి తన పార్టీ స్టాండ్ ఇది అని కచ్చితంగా వివరించలేక పోయారు. లాంగ్ మార్చ్ చేస్తామని, కేంద్రాన్ని ఒప్పిస్తామని మాటలు బాగానే చెప్పారు కానీ ఆచరణలో ఏమీ లేదు. ఇపుడు అటూ ఇటూ తిరిగి అమరావతే దిక్కు అన్నట్లుగా జనసేన పోరాటం చేస్తోంది. దాని వల్ల జనసేనకు కలసివచ్చేది ఏముందో తెలియదు కానీ ఈ పార్టీలతో పాటు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వంటి పార్టీలు ఎంతగా మద్దతు ఇస్తే అంతలా టీడీపీకే ఈ పొలిటికల్ మైలేజ్ దక్కుతుంది. ఎందుకంటే ప్రధాన సామాజికవర్గాలు అన్నీ టీడీపీతోనే ప్రయాణం చేస్తున్నాయి కాబట్టి, రేపు చంద్రబాబు సీఎం అయితేనే వారి ప్రయోజనాలు నెరవేరుతాయి కాబట్టి. మొత్తానికి చూస్తూంటే జగన్ కి మిగిలిన ఏపీ అంతా వదిలేసి అమరావతి రాజధాని కోసం విపక్షాలు అన్నీ పోటీ పడడం చూస్తూంటే వైసీపీకే రాజకీయ లాభం దక్కించేట్లుగా సీన్ కనిపిస్తోంది.

# సత్తెనపల్లిలో కిం కర్తవ్యం..?

**గుంటూరు, డిసెంబర్ 24, (ప్రజా పాలన) :** తెలుగుదేశం పార్టీని తిరిగి పుంజుకునేలా చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎంతగానో ప్రయత్నిస్తూ ఉన్నారు. నియోజకవర్గాల వారీగా చంద్రబాబు నాయుడు ఎన్నో సూచనలను ఇస్తూ ఉన్నారు. గ్రూపు రాజకీయాలను సమిసిపోయేలా చేసి పార్టీ బలోపేతం అయ్యేలా చేయాలని టీడీపీ నాయకులను చంద్రబాబు ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తూనే ఉన్నారు. అలాగే కొన్ని ప్రాంతాల మీద చంద్రబాబు నాయుడు ప్రత్యేకమైన శ్రద్ధ కనబరుస్తూ ఉన్నారు. అలాంటి ప్రాంతాల్లో గుంటూరు జిల్లా సత్తెనపల్లి కూడా ఒకటి. సత్తెనపల్లిలో టీడీపీ నాయకత్వంపై అధిష్ఠానం ఏమీ తేల్చడం లేకపోతోంది. పార్టీలోని 3 వర్గాలు ఇక్కడ పాగా వేయాలని ప్రయత్నిస్తున్నా.. టీడీపీ అధినేత మాత్రం ఎవరికీ సరైన క్లారిటీగా ముందుకు వెళ్ళమని చెప్పలేకపోతున్నారు. కోడెల శివప్రసాదరావు వారసుడిగా కోడెల శివరాం పట్టు నిలుపుకొనేందుకు చాలా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉన్నారు. తండ్రి చేసిన అభివృద్ధిని ప్రజలకు మరోసారి గుర్తుకు తీసుకుని రావాలని అనుకుంటూ ఉన్నారు. మరో ఇద్దరు నేతలు కూడా బలంగా పాతుకుపోవాలని ప్రయ త్నాలు చేస్తూ ఉన్నారు. ఇక చంద్ర బాబు ఏ నేతకి గ్రీన్ సిగ్నల్ ఇస్తారో అన్నది ఆసక్తికరంగా మారింది. అలాగే ఒక్కో నాయకుడిలో ఉండే నెగటివ్ ను కూడా బేరీజు వేసే పనిలో ఉంది టీడీపీ అధిష్టానం. కోడెల శివరాం వ్యవహారాల వల్ల వ్యక్తిగతంగా కోడెల కుటుంబానికి ఎంత నష్టం జరిగిందో, పార్టీకి అంతకంటే ఎక్కువ నష్టం జరిగిందన్న విషయాలను గుర్తు చేస్తూ ఉన్నారు. కానీ కోడెల ఆత్మహత్యతో సానుభూతి మొదలైంది. అప్పటి నుండి టీడీపీ అధినేత చంద్రబాబు పరోక్షంగా సత్తెనపల్లిని కోడెల శివరామ్‌కే అప్పగించారనే టాక్ ప్రచారంలో ఉంది. ఇక మరోవర్గం మన్నెం శివనాగమల్లేశ్వరావు.. కోడెలకు వ్యతిరేకంగా అప్పట్లో చాలానే చేశారనే టాక్ నడిచింది. మల్లిబాబు ప్రస్తుతం ఆయన గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు. సత్తెనపల్లి సీటు సాధించాలనే ప్రయత్నంలో ఉన్నారు. కోడెల శివరాంకు వ్యతిరేకంగా ఉన్నవాళ్లు మల్లిబాబు చెంతన చేరారు. ఇక రాయపాటి రంగారావు పేరు కూడా సత్తెనపల్లి ఎన్నికలకు ముందు వినిపించింది. కోడెలను తప్పించే ఆలోచన హైకమాండ్ చేసింది. కోడెల మరణం తర్వాత అధిష్ఠానం సూచనలతో ఆయన వస్తున్నారని ప్రచారం జరిగింది. కానీ హైకమాండ్ ఎటూ తేల్చలేదు. ఆయన కూడా సత్తెనపల్లిని పట్టించుకోలేదు.

# నిమ్మగడ్డ... ఎన్నికలు నిర్వహిస్తారా...



**విజయవాడ, డిసెంబర్ 24, (ప్రజాపాలన) :** ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నది ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ ముఖ్య ఉద్దేశ్యం. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల నిర్వహణకు ఒప్పుకోవడం లేదు. ఎలాగైనా ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలను ఫిబ్రవరిలో నిర్వహించాలని నిమ్మగడ్డ కోర్టుల దాకా వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరోనా మహమ్మారి కుదిపేస్తోందంటూ ఓ వైపు.. కరోనా వ్యాక్సిన్ వేయాల్సిన అవసరం ఉందని మరో వైపు ఎన్నో కారణాలను చూపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు చేసింది. పంచాయతీ ఎన్నికలపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎస్ఈసీ తరఫున ప్రముఖ న్యాయవాది అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు. అశ్వనీకుమార్ వాదనలతో హైకోర్టు ధర్మాసనం ఏకీభవించింది. ప్రభుత్వం నుంచి ముగ్గురు సీనియర్ అధికారులను వెంటనే ఎస్ఈసీ దగ్గరకు పంపించాలని ధర్మాసనం సూచించింది. రాష్ట్రంలో కరోనా పరిస్థితిపై ఎస్ఈసీకి తాజా పరిస్థితులను వివరించాలని.. సీనియర్ అధికారులతో సంప్రదింపుల తర్వా త ఎన్నికలపై ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేస్తారని ధర్మాసనం సూచించింది. అధికారుల బృందం ఎస్ఈసీతో చర్చించిన అంశాలను తెలపాలన్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం.. దీనిపై 29న తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. కరోనా కారణంగా ఈ ఏడాది మార్చిలో వాయిదా వేసిన స్థానిక ఎన్నికలను వచ్చే ఫిబ్రవరిలో ఎలాగైనా నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్ భావిస్తోంది. ఈ ఏడాది మార్చి 7న ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మొత్తం రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగాలి. తొలిదశలో 333 జెడ్పీటీసీలు, 5వేల 352 ఎంపీటీ సీలకు ఎన్నికలకు జరగాల్సి ఉంది. కరోనా కారణంగా మార్చి 15న ఎన్నికల ప్రక్రియను ఎస్ఈసీ రమేష్ కుమార్ వాయిదా వేశారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న సమయంలో స్థానిక ఎన్నికలు వాయిదా పడ్డాయి. అప్పటికే 2వేల 129 ఎంపీటీసీ, 125 జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ ఏకగ్రీవాలన్నిటినీ రద్దు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అధికార పార్టీ బలవంతపు ఏకగ్రీవాలు చేయించిందని ఎస్ఈసీకి ఫిర్యాదు కూడా చేశాయి.

# సైకిల్ అచ్చి రాదనే ఆటోనా...

**చెన్నై, డిసెంబర్ 24, (ప్రజాపాలన) :** రజనీకాంత్ కొత్తగా తమిళనాడులో రాజకీయ పార్టీని పెట్టబోతున్నారు. ఈ నెల 31వ తేదీన ఆయన పార్టీని ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ గుర్తులపై అనేక ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ప్రధానంగా యోగా ముద్ర గుర్తును ఎంచుకుంటారని తొలుత రజనీకాంత్ అభిమానులు విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే ఆ గుర్తు ఎన్నికల కమిషన్ వద్ద లేకపోవడంతో సైకిల్ గుర్తును రజనీకాంత్ ఎంచుకుంటారని విపరీతంగా ప్రచారం జరిగిందిరజనీకాంత్ అన్నామలై చిత్రంలో నటించిన చిత్రాన్ని కూడా పెద్ద యెత్తున వైరల్ చేశార. ఆ చిత్రంలో రజనీకాంత్ సైకిల్‌పై పాల క్యాన్‌తో వస్తున్న చిత్రంతో తమిళనాడులో పోస్టర్లు కూడా వెలిశాయి. అయితే సైకిల్ గుర్తు ఉన్న పార్టీ పెద్దగా సక్సెస్ కాలేకపోవడం, సెంటిమెంట్ గా కూడా తనకు అచ్చిరాదని రజనీకాంత్ భావించినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ లో అనేక సార్లు సైకిల్ గుర్తు ఉన్న తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. 2004 నుంచి పదేళ్ల పాటు సైకిల్ పార్టీ అధికారానికి దూరంగా ఉంది. 2014లో అధికారంలోకి వచ్చినా తిరిగి 2019 లో అధికారాన్ని కోల్పోయింది. అలాగే సైకిల్ గుర్తు ఉన్న మరో పార్టీ సమాజ్ వాదీ పార్టీ. ఇక్కడ కూడా ములాయం సింగ్ యాదవ్ చేతుల్లో నుంచి అఖిలేష్ యాదవ్ పార్టీని లాగేసుకున్నారు. విజయానికి దూరమయింది. ఈ సెంటిమెంట్ నేపథ్యంలో రజనీకాంత్ సైకిల్ గుర్తును నిరాకరించినట్లు చెబుతున్నారు. రజనీకాంత్ ఆటో గుర్తును ఎంచుకున్నారని తెలుస్తోంది. ఆటో గుర్తు అయితే సామాన్యుడికి దగ్గరగా ఉంటుందని, ప్రజలు కూడా సులువుగా గుర్తును గుర్తుపడతారని రజనీ భావించారు. అందుకే ఆయన ఎన్నికల కమిషన్ కు తమ పార్టీకి ఆటో గుర్తు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారంటున్నారు. 31న దీనిపై క్లారిటీ వచ్చే అవకాశముంది.

# బొత్స కుమారుడు ఎంట్రీకి సిద్ధం

**విజయనగరం, డిసెంబర్ 24, (ప్రజాపాలన) :** రాజకీయాల్లో వారసులను హైలైట్ చేయడానికి ప్రయత్నించే నాయకులు ఎంతో మంది ఉన్నారు. తాము వెళ్ళిపోయినా తమ వారసత్వం రాజ్యాలను ఏలాలన్నది నాయకుల ఇన్నర్ ఫీలింగ్. ఇంటికి ఒక రాజకీయనాయకుడు వెలిగాడు అంటే.. ఇంట్లో ఉన్న వాళ్లు మాత్రమే కాదు.. ఇతరులు కూడా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేస్తారు. తాజాగా బొత్స సత్యనారాయణ కూడా వారసుడిని పాలిటిక్స్ లోకి రంగంలోకి దింపాలనే ప్రయత్నాల్లో ఉన్నారు. బొత్స కుటుంబం ముందు నుండి రాజకీయాల్లోకి వస్తూనే ఉంది. బొత్స భార్యను, ఇతర బంధువులను కూడా రాజకీయాల్లోకి తీసుకుని వచ్చారు. ఇప్పుడు వారసుడిని రంగంలోకి దించబోతున్నట్టు తెలుస్తోంది. బొత్స భార్య ఝాన్సీ గతంలో విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ చేశారు. ఆ తర్వాత ఎంపీగానూ ఉన్నారు. తమ్ముడు అప్పల నర్సయ్యను కాంగ్రెస్ హయాంలోనే ఎమ్మెల్యేను చేయగా, మరో కుటుంబ సభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడిని కూడా నెల్లిమర్ల నుంచి అసెంబ్లీకి పంపించారు. ఇలా ఇప్పటి వరకు భార్య, సోదరుడు, మేనల్లుడిని మాత్రమే రాజకీయాలకు పరిచయం చేశారు బొత్స సత్యనారాయణ. బొత్స కుమారుడు సందీప్‌బాబు రాజకీయాలకు దూరంగా విశాఖలో డాక్టర్‌గా స్థిరపడ్డారు. డాక్టర్ సందీప్ పుట్టినరోజు సందర్భంగా ఎన్నడూ లేనంతగా విజయనగరం అంతా ఫ్లెక్సీలు వెలియడంతో సందీప్ పొలిటికల్ ఎంట్రీ ఖాయమైందని అనుకుంటున్నారు. కుమారుడిని తీసుకుని విజయవాడ వెళ్లిన బొత్స సత్యనారాయణ.. సీఎం జగన్ బర్త్‌డే సందర్భంగా రక్తదానం చేశారు. ఇదంతా పొలిటికల్ ఎంట్రీకి ముందు జరుగుతున్న పరిచయ కార్యక్రమాలని స్పష్టంగా తెలుస్తోంది. ఒకవేళ వారసుడిని పొలిటికల్ ఎంట్రీ చేయించాలని అనుకుంటే.. ఎక్కడ నుంచి పోటీ చేయిస్తారు అనే చర్చ మొదలైంది అప్పుడే..! చీపురుపల్లి నుంచి స్వయంగా బొత్స ఎమ్మెల్యేగా, గజపతినగరం బొత్స సోదరుడు అప్పలనర్సయ్య, నెల్లిమర్ల బడ్డుకొండ అప్పలనాయుడులతో ఉండగా.. ఇప్పుడు కుమారుడిని ఎక్కడి నుండి దింపుతారనే ప్రచారం జరుగుతూ ఉంది. ఈ రాజకీయాలపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. పలువురు నాయకులు తమ కుమారుల్లను రాజకీయ నాయకులుగా ఎంట్రీ చేయిస్తున్నారు. త్వరలో బొత్స కూడా ఆ విషయంలో క్లారిటీ ఇస్తారేమో చూడాలి.

# నందిగం సురేష్ కు కీలక బాధ్యతలు

**గుంటూరు, డిసెంబర్ 24, (ప్రజా పాలన) :** గుంటూరు జిల్లా బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌కు రేపో మాపో.. సీఎం జగన్ నుంచి పిలుపు అందుతుందన్న ప్రచారం వైసీపీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన నాయకులు ఈ విషయాన్ని చర్చించుకుంటున్నారు. తాజాగా తిరుపతికి చెందిన మంత్రి ఒకరు ఈ విషయాన్ని చూచాయగా మీడియాకు వెల్లడించారు. నందిగం సురేష్‌కు సీఎం జగన్ కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారని ఆయన అన్నారు. అయితే.. ఆ బాధ్యతలు ఏంటి? అనే విషయం మాత్రం గోప్యంగా ఉంది. ఇక, ఇప్పుడున్న పరిస్థితిలో సీఎం జగన్‌కు కీలకమైన విషయం ఏదైనా ఉంటే.. అది ఒకటి ఇళ్ల పంపిణీ, రెండు తిరుపతిలో రాబోయే ఉప ఎన్నిక. ఈ నేపథ్యంలో ఈ రెండు విషయాల్లో దేనిని ఆయన నందిగం సురేష్‌కు అప్పగిస్తారనే విషయం ఆసక్తిగా మారింది. పైగా ఈ రెండు విషయాలకే నందిగం సురేష్‌ను పిలుస్తున్నారా ? లేక మరేదైనా కారణం ఉందా ? అనే కోణంలో నూ వైసీపీలో చర్చ అయితే ఉంది. ఈ చర్చలు ఎలా ? ఉన్నా అత్యంత విశ్వసనీయ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు తిరుపతి పార్లమెంటు స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నిక విషయంలో ఇంచార్జ్ పోస్టు నందిగం సురేష్‌కు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. జగన్ అంటే అత్యంత విశ్వసనీయత ఉండడంతోపాటు.. మంచి ఫైర్ బ్రాండ్‌గా కూడా ఆయన ఇటీవల కాలంలో బాగానే పనిచేశారు. పైగా ఎస్సీ సామాజిక వర్గంలోనూ మంచి




గుర్తింపు ఉంది. ఇక, రోడ్ల మీద బతికే తనను సీఎం జగన్ ఎంపీని చేశారంటూ.. ఆయన పండించిన సెంటిమెంట్ కూడా బాగానే వర్కవుట్ అయింది. ఈ క్రమంలో తిరుపతిలో ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించి.. ప్రచారాన్ని ఆయన కనుసన్నల్లో నడిపించే ఆలోచనలో జగన్ ఉన్నారని కూడా కొందరు వైసీపీ నేతలు చెపుతున్నారుప్రస్తుతం టీడీపీ కూడా ఇదే సూత్రాన్ని అవలంబిస్తోంది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలను ఇక్కడ రంగంలోకి దింపుతోంది. ఈ క్రమంలో మంది ఎక్కువగా ఉండకుండా .. సింగిల్ హ్యాండ్‌తో నెట్టుకువచ్చే వ్యూహం చేయాలని జగన్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. పైగా తనకు అనుకూలంగా ఉండడం, రేపు ఎవరైనా అమరావతి సెంటిమెంటును రెచ్చగొట్టినా.. ఆ ప్రాంత ఎంపీగా దానిని తిప్పికొట్టేందుకు, ఎస్సీ యువతను ప్రధానంగా ఆకర్షించేందుకు నందిగం సురేష్ ఉపయోగపడతారని పార్టీ భావిస్తు న్నట్టు ఆ మంత్రి చెప్పుకొచ్చారు. దీంతో ప్రచారం, ప్రజల్లోకి వెళ్లే అంశాల్లో నందిగం సురేష్ పై బాధ్యతలు అప్పగించేందుకు జగన్ ఆలోచన చేస్తున్నారనేది ఆయన చూచాయగా చెప్పిన మాట. ఇక తిరుపతి పార్లమెంటు సీటు కూడా ఎస్సీలకు రిజర్వ్ అయిన సీటు. అక్కడ టీడీపీ ఇప్పటికే కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పేరును ఖరారు చేయ గా.. వైసీపీ నుంచి డాక్టర్ గురుమూర్తి పేరు వినవస్తోంది. ఇక్కడ ఇన్నర్‌గా బాధ్యతలు, ఆర్థిక వ్యవహారాలు పెద్దిరెడ్డికి అప్పగించినా, మెయిన్‌గా ప్రచారం, ఇతరత్రా బాధ్యతలు నందిగం సురేష్ చేతుల్లోనే పెట్టి టీడీపీకి చెక్ పెడతారని వైసీపీ నేతల టాక్. ప్రస్తుతం ఈ విషయం వైసీపీలో హాట్ టాపిక్‌గా మారింది. రేపో మా పో.. జగన్‌నుంచి నందిగం సురేష్ కు పిలుపు వస్తుందని అంటున్నారు. ఇక సంక్రాంతి వెళ్లిన వెంటనే జనవరి చివర్లో లేదా ఫిబ్రవరి తొలి వారంలో తిరుపతి ఉప ఎన్నిక నోటిఫికేషన్ వెలువడనుంది.

# ఇండస్ట్రీ బ్రేకింగే.. క్రేజీగా బాబాయ్ అబ్బాయి కాంబో..!



ఇటీవలే నిహారిక కొణిదెల వివాహంలో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సహా మెగా హీరోలంతా సందడి చేశారు. ఆ సందర్భంలో పవన్ తో పాటు ఇతర మెగా హీరోలు ఒకే ఫ్రేమ్ లో ఫోటోలు దిగారు. ఆ ఫోటోలన్నీ అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. ఆ క్రమంలోనే మెగా మనం ఎపుడో అంటూ ఆసక్తికర చర్చ సాగింది. మెగాస్టార్ చిరంజీవి- పవన్ కల్యాణ్ కాంబినేషన్ మూవీ అన్నారు కానీ అది ఇప్పటి వరకూ కుదరనేలేదు. ఇక పవన్ కల్యాణ్ బాబాయ్‌తో కొణిదెల బ్యానర్‌లో సినిమా తీయాలన్న రామ్‌చరణ్ కోరిక కూడా నెరవేరలేదు. ఆశయం ఉన్నా దానిని సాధించుకునేందుకు సరైన స్క్రిప్ట్ కానీ.. సరైన దర్శకుడు కానీ రామ్ చరణ్ కి ఇంతవరకూ పరిచయం కాకపోవడమే ఈ పెండింగుకి కారణమని తెలిసింది. పవన్ రాజకీయాలకు బ్రేకిచ్చి వరుస సినిమా లకు కమిటైనా చరణ్‌తో సినిమాని ప్రకటించకపోవడానికి కారణ మిదే. తాజా సమాచారం ప్రకారం.. రామ్ చరణ్ సరైన స్క్రిప్ట్ కోసం వేటలోకి దిగారట. పవన్ కళ్యాణ్ రేంజుకు తగ్గ దర్శకుడిని వెతికే పనిలో ఉన్నారని తెలుస్తోంది. మొన్న పవన్ కళ్యాణ్ తో రామ్‌చరణ్ సమావేశంలో దీని గురించి మరోసారి చర్చించారు. చరణ్ ఈ ప్రాజెక్ట్ పై ప్రత్యేక దృష్టి పెట్టాడని తెలిసింది. కొణిదేల ప్రొడక్షన్ కంపెనీ బ్యానర్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తారు. ప్రస్తుతానికి అగ్రశ్రేణి దర్శకులంతా వరుస సినిమాలతో బిజీగా ఉండడంతో ఎవరైనా యువ దర్శకుడిని ఎంపిక చేసే వీలుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. మరిన్ని వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటిస్తారు.

# విజయ్ దేవరకొండ సౌత్‌లోనే నెం.1




'విజయ్ దేవరకొండ..' ఈ పేరు చెప్పగానే ఆడియన్స్‌కు 'అర్జున్ రెడ్డి' మూవీయే గుర్తొస్తుంది. తనదైన నటనతో సినిమాను భుజాలపై మోసిన విజయ్.. బ్లాక్ బస్టర్ హిట్ సాధించాడు. తన మార్క్ యాక్టింగ్ తో ఇటు ఆడియన్స్ ను మెస్మరైజ్ చేసి యావత్ సినీ ఇండస్ట్రీ దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు.

**హ్యాట్రిక్ హీరో..**

విజయ్ హ్యాట్రిక్ హిట్ కొట్టాడు. అయితే.. యాధృశ్చికంగా తొలి సినిమా మూడో సినిమా లైటర్ వేలో సాగే లవ్ స్టోరీసే. పెళ్లిచూ పులు గీతాగోవిందం చిత్రాల్లో ఫ్యామిలీ బాయ్‌గా అలరించిన విజయ్.. మిడిల్ మూవీ 'అర్జున్ రెడ్డి'లో మ్యాత్రం స్పెషల్ ఆటిట్యూడ్ రోల్ లో అదరగొట్టాడు. ప్రేమలో దెబ్బతిన్న లవర్ పాత్రలో జీవించే శాడు. దీంతో.. ఓవర్ నైట్ లో స్టార్ హీరో రేంజ్ కు దూసుకెళ్లాడు దేవరకొండ. అయితే.. ఆ తరువాత వచ్చిన నోటా డియర్ కామ్రేడ్ వరల్డ్ ఫేమస్ లవర్' వంటి చిత్రాలు ఊహించిన స్థాయిలో ఆడలేదు.

**10 మిలియన్ ఫాలోవర్స్..**

విజయ్ దేవరకొండ కి సోషల్ మీడియా లో వున్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తాజాగా ఈ హీరో ఇన్ స్టాగ్రామ్ లో 10 మిలియన్ ఫాలోవర్ల మార్క్ ను దాటాడు. సౌత్ ఇండియా మొత్తంలో 10 మిలియన్ ఇన్ స్టాగ్రామ్ ఫాలోవర్స్ ఉన్న ఏకైక హీరో విజయ్ దేవరకొండ. అది కూడా తను ఇన్ స్టాగ్రామ్ లోకి ఎంటరైన తక్కువ సమయంలోనే ఈ మార్కును చేరుకోవడం మరో విశేషం. ప్రస్తుతం డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాద్ దర్శకత్వం లో "ఫైటర్" అనే సినిమా చేస్తున్నాడు విజయ్. ఈ సినిమాలో అనన్య పాండే హీరోయిన్ గా నటిస్తోంది. ఇక ఈ సినిమా పాన్ ఇండియా మూవీగా తెరకెక్కుతోంది.



# సాయితేజ్ ఆ ఫీట్ రిపీట్ చేస్తాడా?

కరోనా కారణంగా కొన్నినెలల పాటు థియేటర్లు బంద్ అయిపోయాయి. అన్‌లాక్ తర్వాత థియేటర్లకు అనుమతి లభించినప్పటికీ కరోనా భయంతో ఇప్పటివరకు సినిమాలేవీ విడుదల కాలేదు. థియేటర్లకు ప్రేక్షకులు వస్తారా? అనే అనుమానంతో నిర్మాతలెవరూ ధైర్యం చేయడం లేదు. అయితే సోలో బ్రతుకే సో బెటర్ టీమ్ ధైర్యంగా ముందడుగేసింది. మెగా హీరో సాయితేజ్ కథానాయకుడిగా నూతన దర్శకుడు సుబ్బు రూపొందించిన చిత్రం సోలో బ్రతుకే సో బెటర్. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని సాయితేజ్ నమ్మకంగా ఉన్నాడు. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన ప్రతిరోజూ పండగే తరహాలో ఈ ఏడాది డిసెంబర్‌లో సోలో బ్రతుకే సో బెటర్ ఘన విజయం సాధిస్తుందని నమ్ముతున్నాడు. ఈ సినిమా ఫలితం కోసం చిత్ర యూనిట్ మాత్రమే కాదు.. టాలీవుడ్ ఇండస్ట్రీ మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# మళ్లీ పింక్ ఎలిఫెంట్‌తో రాబోతున్న మెగా ప్రిన్సెస్




మంచు వారి అమ్మాయి లక్ష్మి ప్రసన్న మాదిరిగా మెగా ప్రిన్సెస్ అంటూ పేరు దక్కించుకున్న నిహారిక కొణిదెల కూడా మల్టీ ట్యాలెంటెడ్ అంటూ ఇండస్ట్రీలో అందరితో అనిపించుకుంది. యాంకరింగ్ నుండి నిర్మాణం వరకు అనేక రంగాల్లో నిహారిక తన వేలు ఉంచింది. హీరోయిన్ అవ్వాలనేది ఆమె డ్రీమ్. ఆ డ్రీమ్ అయితే నిజం అయ్యింది కాని కమర్షియల్ సక్సెస్ లు కాలేక పోయింది. పెళ్లి చేసుకున్న నిహారిక ఇక సినిమాల్లో హీరోయిన్ గా నటించే అవకాశం కనిపించడం లేదు. ఆమె భర్త చైతన్య ను హీరోగా పరిచయం చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయనే వార్తలు వస్తున్నాయి. త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఇక ఈ సమయంలో నిహారిక మళ్లీ ప్రొడక్షన్ హౌస్ ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తుందట. నిహారిక ఇప్పటికే పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ లో ముద్దపప్పు ఆవకాయ్.. నాన్న కుచ్చి.. మ్యాడ్ హౌస్ అనే వెబ్ సిరీస్ లను నిర్మించింది. ఇకపై తన పింక్ ఎలిఫెంట్ ను మరింతగా యాక్టివ్ చేసి చిన్న సినిమాలు మరియు వెబ్ సిరీస్ లను వరుసగా నిర్మించాలని భావిస్తుందట. అందుకోసం పది మంది టీంను ఆఫీస్ ను కూడా నిహారిక దంపతులు ఏర్పాటు చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. తక్కువ ఖర్చుతో వెబ్ సిరీస్ లు సినిమాలు తీస్తే ఈ మధ్య డబుల్ ప్రాఫిట్ లు వస్తున్న దాఖలాలు ఉన్నాయి. అందుకే నిహారిక నిర్మాతగా బిజీ అవ్వాలనుకుంటున్నట్లుగా మెగా కాంపౌండ్ నుండి సమాచారం అందుతోంది. ఇటీవలే చిరంజీవి పెద్దమ్మాయి సుష్మిత కూడా నిర్మాతగా మారి షూట్ ఔట్ వెబ్ సిరీస్ ను నిర్మించిన విషయం తెల్సిందే.

# బిడ్డ తల్లి అయ్యాకా అగ్గి రాజేస్తోందిలా



2.0 లో రోబో గాళ్ గా నటించింది ఎమీ జాక్సన్. ఆ తర్వాత లండన్ బిజినెస్ మ్యాగ్నెట్ జార్జి పనాయ టౌతో ప్రేమలో మునిగింది. ఫలి తంగా ఒక బిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ ఆండ్రియాస్ జననం అనంత రం నిశ్చితార్థం చేసుకుని త్వరలోనే జార్జిని పెళ్లాడేస్తున్నా అంటూ ప్రకటించింది. దాంతో అభిమానులు చాలా సంతోషించారు. అయితే ఆ తర్వాత పెళ్లికి సంబంధించిన వార్త అయితే రాలేదు. ఎమీజాక్సన్ నిశ్చితార్థం అనంతరం చాలా మం ది తోటి తారలు పెళ్లాడి లైఫ్ లో సెటిలయ్యారు కానీ తన నుంచి మాత్రం క్లియర్ కట్ గా సమాచారం ఏదీ లేదు. ఇకపోతే జార్జితో రొమాంటిక్ లైఫ్ విషయంలో మాత్రం ఎమీ ఎక్కడా తగ్గలేదు. ఇటీవల పలుమార్లు బీచ్ వెకేషన్ కి సంబంధించిన ఫోటోల్ని అలాగే ఆండ్రియాస్‌తో క్యూట్ సన్నివేశాల్ని ఎమీజాక్సన్ షేర్ చేసింది. ప్రస్తుతం లండన్ -యూకేని స్ట్రైన్(కరోనా) వైరస్ ఒణికిస్తున్న సంగతి తెలిసిం దే. ఆ క్రమంలోనే ఎమీజాక్సన్ ఈ హాటెస్ట్ ఫోటోని షేర్ చేసి మరో మెగా లాక్ డౌన్ ఏదీ లేదు! అం టూ వ్యాఖ్యను జోడించింది. అంటే బ్రిటన్‌లో భయాందోళలపై బయట జరుగుతున్న ప్రచారాన్ని ఈ భామ ఖండించినట్టే అనుకోవాలి.

# ఆద్యంతం ఆసక్తిరేపుతున్న 'థ్యాంక్ యూ బ్రదర్' మోషన్ పోస్టర్..!!




కరోనా మహమ్మారి సినిమా ఇండస్ట్రీ మొత్తాన్ని ఒక కుదుపు కుదిపేసింది. అటు ఆర్థికంగాను ఇటు ఆరోగ్యం పరంగాను ఎంతో నష్టం మిగిల్చింది. అయితే ఈ ఎఫెక్ట్ ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలతో పాటు సినీ ఇండస్ట్రీని కూడా దెబ్బతీసింది. కానీ ఇంతకాలం షూటింగ్ ఆపేసి జాగ్రత్తలు పాటించినా.. ఇప్పుడు కరోనా మీదే సినిమాలు తీస్తున్నారు మేకర్స్. అయితే తాజాగా కరోనా టైంలో ఎదుర్కొన్న పరిస్థితులను ఆధారం చేసుకొని.. కొన్ని కాల్పనిక ఘటనలను కథనంగా మలిచి రూపొందిస్తున్న సినిమా 'థ్యాంక్ యూ బ్రదర్'. స్టార్ టీవీ యాంకర్ అనసూయ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ సినిమాను రమేష్ రాపర్తి తెరకెక్కిస్తున్నారు. ఇదివరకే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్ను హీరో రానా దగ్గుబాటి లాంచ్ చేశారు. ఆ పోస్టర్ బట్టి చూస్తే ఓ లిఫ్ట్ దాని ఎదురుగా ఫ్లోర్ మీద పడి ఉన్న మాస్క్ కనిపిస్తున్నాయి. టైటిల్ లోనే థ్యాంక్ యూ బ్రదర్ అని చెప్పడం కరోనా కాలంలో మాస్క్ ప్రాధాన్యతను చెప్తున్నట్లే అనిపిస్తుంది. ఇక టైటిల్ పోస్టర్ తో ఆసక్తి రేపిన ఈ చిత్ర బృందం.. తాజాగా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. సూపర్ స్టార్ మహేష్ బాబు లాంచ్ చేసిన 'థ్యాంక్ యూ బ్రదర్' మోషన్ పోస్టర్ సినిమా పై మరింత ఆసక్తి రేపుతుందని చెప్పవచ్చు. 'హలో పైన ఎవరైనా ఉన్నారా.. ఉంటే రెస్పాండ్ అవ్వండి' అనే మాటలు బట్టే లిఫ్ట్ లో ఇరుక్కుపోయారని అర్థమవుతుంది. కానీ మోషన్ పోస్టర్ లో మరో ట్విస్ట్ ఇచ్చారు మేకర్స్. లిఫ్ట్ యువకుడు ఒక గర్భిణీ ఇరుక్కుపోయినట్లు చూపిస్తూ ఆద్యంతం ఇంటరెస్ట్ ఆకట్టుకుంటున్నారు. ఎలివేటర్ (లిఫ్ట్)కు కథలో కీలక పాత్ర ఉందనే అభిప్రాయాన్ని ఈ మోషన్ పోస్టర్ తెలుపుతుంది. ప్రస్తుతం నెట్టింట ఈ మోషన్ పోస్టర్ వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో అనసూయ భరద్వాజ్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. అశ్విన్ విరాజ్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. మాగుంట శరత్చంద్రా రెడ్డి తారక్నాథ్ బొమ్మిరెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనులతో విడుదలకు రెడీ అవుతుంది. చూడాలి మరి ఈ ఎక్సపరిమెంటల్ ఫిల్మ్ ఉండబోతుందో..!!

# తెలుగు డబ్బింగ్ కోసం తంటాలు పడుతున్న బాలీవుడ్ 'సీత'..!



బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ 'ఆర్.ఆర్.ఆర్' సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. దర్శకధీరుడు రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ మల్టీస్టారర్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ 'కొమురం భీమ్' పాత్రలో నటిస్తుండగా.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'అల్లూరి సీతారామరాజు'గా కనిపించనున్నాడు. ఇందులో అలియా చరణ్ కు జోడిగా 'సీత' పాత్రలో నటిస్తుండగా.. తారక్ సరసన ఐరిష్ నటి ఒలివియా మోరిస్ నటిస్తోంది. ఇటీవలే 'ఆర్.ఆర్.ఆర్' షూట్ తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ఆలియా కూడా టీమ్ తో జాయిన్ అయింది. హైదరాబాద్ షెడ్యూల్ లో అలియా పాల్గొనే కొన్ని సన్నివేశాలను కూడా చిత్రీకరించారు. అయితే 'ఆర్.ఆర్.ఆర్' ఆలియాకు మొదటి తెలుగు సినిమా అయినప్పటికీ.. తన పాత్రకు తనే స్వయంగా డబ్బింగ్ చెప్పుకోడానికి ట్రై చేస్తోందని తెలుస్తోంది. ఇందుకోసం అమ్మడు స్పెషల్ క్లాసులను తీసుకుంటూ తెలుగు ఉచ్చారణ కోసం తంటాలు పడుతోందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అలియా.. చాలా కాలంగా తెలుగు డైలాగులను వల్లె వేస్తున్నానని.. ఈ ఎక్సపీరియన్స్ చాలా డిఫరెంట్ గా ఉందని చెప్పుకొచ్చిందట. ఏదేమైనా అలియా టాలీవుడ్ లో సాలిడ్ డెబ్యూ ఇవ్వనుందని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నారు. అలానే బాలీవుడ్ లో ఈ మధ్య ఆమెపై తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో 'ఆర్.ఆర్.ఆర్' సినిమాతో మళ్ళీ ట్రాక్ లోకి వస్తుందని భావిస్తున్నారు.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed at Unyted Publications from H.no.# 5+-61-3,Rajendra Nagar,Seethampeta,Visakhapatnam-16,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16, Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com